ప్రజాశక్తి
సోమవారం 16 జూన్ 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

'కూలి'న బతుకులు

- ఐషర్ లారీ-బొలెరో ఢీ
- డ్రైవర్ మృతి.. 13 మందికి తీవ్ర గాయాలు
- యర్రగొండపాలెం వాసుల్లో ఆందోళన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పెట్టుబడి లేకపోయినా కష్టాన్ని పెట్టుబడిగా మలుచుకుని బతుకుదెరువు కోసం బయలుదేరిన కూలీలను మృత్యువు వెంటాడుతోంది. కూలీలతో వెళుతున్న ఐషర్ లారీ, బొలెరో వాహనం ఢీకొనడంతో యర్రగొండపాలెం సమీపంలోని అనకుంట వద్ద ఆదివారం తెల్లవారుజామున ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక డ్రైవర్ ప్రాణాలు కోల్పోగా, 13 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. నంద్యాల నుంచి బొలెరో వాహనం 565 జాతీయ రహదారి మీదుగా మాచర్లకు వెళుతుండగా, అదే సమయంలో యర్రగొండపాలెం మీదుగా దొనకొండ ప్రాంతానికి బొప్పాయి కోతకు బయలుదేరిన ఐషర్ మినీ లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ షీలా కుమారస్వామి(40) అక్కడికక్కడే మృతి చెందాడు. అతనిది తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లా తాళూరు మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. బొలెరో వాహనంలో ప్రయాణించిన తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన సందీప్ అనే డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చెన్నరాయినిపల్లి, గడ్డమీదపల్లి గ్రామాలకు చెందిన 25 మంది బొప్పాయి కూలీల్లో 13 మంది తీవ్రంగా గాయపడారు. వీరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట, వినుకొండ ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనా స్థలాన్ని ఎస్సై చౌడయ్య పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాద సమయంలో రెండు వాహనాలు రహదారిపై అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ప్రొక్లెయినర్ సహాయంతో వాహనాలను రోడ్డు పక్కకు తరలించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో ▶ 2లో

సంతృప్తిగా ఉన్నామా.?

- పాలకపక్షంలోనే ద్వితీయశ్రేణి నేతల పెదవి విరుపు
- అధికారం వచ్చాక వైసిపి నేతల చేరికలతో క్షేత్రంలో మారిన వ్యూహం
- ఇద్దరూ కలవలేక.. సమన్వయం.. పెత్తనం అంశాల్లో అసంతృప్తులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఏడాది పాలనపై విశ్లేషణలు జోరందుకుంటున్నాయి. రాష్ట్రస్థాయిలో అనేక రకాలుగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మేధావులూ పాలనపై తమ భావనను వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఆశలతో అధికారంలోకి వచ్చిన కూటమి లో నేతలు ఎలా ఉన్నారు? ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చారా? ద్వితీయశ్రేణి నేతలను గుర్తించి వారికి న్యాయం చేశారా? పార్టీ జెండా భుజాన వేసుకొని.. వైసిపిపై అన్ని సందర్భాల్లో ఐదేళ్లు పోరాడి కేసులు పెట్టించుకున్న వారి పరిస్థితి ఏమిటి? అలాంటి వారంతా సంతృప్తిగా ఉన్నారా? అంటే మిశ్రమ స్పందనే వస్తోంది. ఎంతమేరకు ఎవరు సంతృప్తిగా ఉన్నారన్నదే ప్రశ్నార్థకంగా మారింది.

ఏడాదిలో ఎవరూ ఊహించని పరిణామాలు చోటుచేసు కున్నాయి. ఇవి రాజకీయంగానూ అస్థిత్వ చిత్రపటాన్ని ఆవిష్కరించాయి. ఐదేళ్లు కష్టపడి అధికారం కోసం పనిచేసిన తెలుగుదేశం కార్యకర్త తనకు తాను ప్రశ్నించుకునే పరిస్థితి కూడా వచ్చింది. ఇంత కష్టపడింది ఎవరి కోసం.? అనే భావన చాలా మందిలో విని పిస్తోంది. ఈ భావన వస్తే పార్టీపై అభిమానం, పట్టుదలతో పనిచేయాలనే ఆలోచనలు సన్నగిల్లుతాయి. అందుకే వైసిపి గత ఎన్నికల్లో ఓటమి పాలైంది. ఇదే ట్రెండ్ ఇప్పుడు తెలుగుదేశం కార్యకర్తల్లోనూ కనిపిస్తోంది. ఎక్కువ శాతం మంది అసంతృప్తిగానే ఉన్నారన్నది సారాంశం. ఎందుకంటే ఎన్నికల్లో ఎంతో కష్టపడి పనిచేశారు. అధికారం వచ్చాక స్థానిక సంస్థల్లో పెత్తనం కోసం ఎమ్మెల్యేలు తమ బాణీ మార్చుకున్నారు. మున్సిపాల్టీలు మొదలు మండల పరిషత్‌లు, పంచాయతీల్లో వైసిపి ప్రజాప్రతినిధులను తెలుగుదేశంలోకి చేర్చుకున్నారు. ఐదేళ్లు పదవులతో అధికారం అనుభవించిన వైసిపి ప్రజాప్రతినిధులకు ▶ 2లో

యోగా చేస్తున్న కలెక్టర్ తమీమ్అన్సారియా, మంత్రి స్వామి, ఎస్పీ దామోదర్

యోగాతో ఆరోగ్యం

పాకలలో 'యోగాంధ్ర' ▶ 5లో

'మార్గదర్శి'ల కోసం వెతుకులాట

చినగంజాం మండలం, కొత్తగొల్లపాలెంలో జరిగిన పి4 ప్రజావేదికలో పాల్గొన్న సిఎం చంద్రబాబు (ఫైల్)

- అధికారులకు చుక్కలు చూపిస్తున్న పి-4 విధానం
- ప్రభుత్వం నుంచి ఏదొక సాయాన్ని ఆశిస్తున్న ధనవంతులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'పేదరిక నిర్మూలనే ధ్యేయం' అంటూ.. రాష్ట్రప్రభుత్వం పబ్లిక్- ప్రైవేట్- పీపుల్స్- పార్ట్నర్‌షిప్ (పి4) విధానాన్ని తెచ్చింది. పి4 విధానం ద్వారా సమాజంలో ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న 10 శాతం మంది అట్టడుగున ఉన్న పేదల వర్గాల వారు 20 శాతం మందికి చేయూతనిస్తే మంచి ఫలితాలు వస్తాయని చెబుతూ.. ఈ విధానాన్ని రాష్ట్రప్రభుత్వం రూపొందించింది. తమ సొంత ఊళ్లు, మండలాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు పలువురు ధనవంతులు, పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారని అంటూ.. పి4 విధానాన్ని ముందుకు తెచ్చారు. గ్రామాల్లో ఉన్న నిరుపేదలు బంగారు కుటుంబాలుగా, వారిని ఆదుకునేందుకు వచ్చిన ధనవంతులు లేదా పారిశ్రామికవేత్తలను మార్గదర్శులుగా నామకరణం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోనే మొదటిగా బాపట్ల జిల్లాలో చినగంజాం మండలం, కొత్తగొల్లపాలెం గ్రామాన్ని పి4 కార్యక్రమం అమలు కోసం ఎంపిక చేశారు. ఏప్రిల్ ఒకటో తేదీన గ్రామంలో నిర్వహించిన పి4 సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఆ గ్రామంలో ప్రజల నుంచి విన్నపాల మేరకు స్థానిక సమస్యల పరిష్కారం, పేద కుటుంబాల ఉద్ధరణ కోసం ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తామన్నారు. ఆనాటి సభలో గ్రామంలోని పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు పర్చూరు నియోజకవర్గానికి చెందిన విక్రమ్ నారాయణరావు, వసంత శ్రీనివాసరావు ముందుకు వచ్చారు. వారిద్దరూ చెరో 15 కుటుంబాలను దత్తత తీసుకుని వారి బాగోగులు చూసుకోవడం జరుగుతుందని చెప్పారు. అనంతరం జిల్లా అంతటా పి4 అమలు కోసం ఒక్కో మండలంలో సుమారు 500 బంగారు కుటుంబాలు ఎంపిక చేయడం, సదరు పేద కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మార్చేందుకు కావలసిన మార్గదర్శిల ఎంపిక కోసం అధికారులు జల్లెడ పట్టి వెతుకుతూ వచ్చారు. జిల్లాలో సచివాలయాల వారీగా జరిపిన సర్వేల్లో పి4 విధానం అమలు కోసం పేద కుటుంబాలు 62 వేల వరకు ఉన్నట్లు తేల్చారు. ఈ బంగారు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుని వారి జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు ▶ 2లో

సంతృప్తిగా ఉన్నామా.?

(మొదటిపేజీ తరువాయి)

ప్రాధాన్యత పెరిగింది. వాళ్లదే స్థానిక సంస్థల్లో పెత్తనం అయ్యింది. ఎందుకంటే ఎక్కువ శాతం మంది తెలుగుదేశంలోకి చేరాక పదవుల్లో ఉన్నందున ఎటూ ప్రాధాన్యత తప్పదు. ఒంగోలు మున్సిపాల్టీ మొదలు అన్నిచోట్లా ఇదే పరిస్థితి. పాలకవర్గాలను మార్చుకునే పనిలో పడ్డారు. కారణం పాలకపక్షం తమ చేతిలో ఉంటే ఏదైనా చేయవచ్చున్నదే ఎమ్మెల్యేల ఆలోచన. దీని వల్ల తెలుగుదేశం కార్యకర్తలు ఎవరిపైనైతే పోరాడారో వారితోనే ఇప్పుడు రాజీధోరణితో సర్దుకుపోతున్నారు. కొన్ని చోట్ల ఈ సర్దుబాటు కూడా కుదరడం లేదు. నాయకుల మధ్య సమన్వయం కనిపించడం లేదు. ఎవరికి పనులు ఇవ్వాలో స్పష్టత ఉండటం లేదు. అందరికీ న్యాయం చేయలేక ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నారు. రేషన్, గ్రావెల్, గ్రానైట్ రంగాల్లో పెత్తనం వల్ల కూడా నేతల మధ్య అసంతృప్తులున్నాయి. అవకాశం దక్కినోళ్లు సంతృప్తిగా ఉండగా... క్షేత్రస్థాయిలో వైసిపితో కలిసి పనిచేయాల్సిన చోట్ల తెలుగుదేశం నేతలు తీవ్రంగా విభేదిస్తున్నారు. పైకి కనిపించకపోయినా లోపల అసంతృప్తితో రగిలిపోతున్నారు. అనివార్యంగా సర్దుకుపోతున్నారు. ఐదేళ్లు ఇరుపార్టీల తరపున రాజకీయ పోరాటం చేసినోళ్లు ఇప్పుడు కలిసి పనిచేయాల్సి రావడం అనేక చోట్ల ఇబ్బందిగా మారింది. ఎక్కువ శాతం మంది ద్వితీయశ్రేణి నేతలు తమకు గుర్తింపు లేదనే అసంతృప్తితో ఉన్నారు. నోరున్న వారికే ఎంతో కొంత ప్రాధాన్యత కనిపిస్తోంది. ఎమ్మెల్యేల కార్లలో వైసిపి ప్రజాప్రతినిధులు కనిపిస్తున్నారు. ఎందుకంటే వాళ్లు పదవుల్లో ఉన్నారు. ద్వితీయశ్రేణి నేతల పరిస్థితి ఇలా ఉంది. ఇక ఎమ్మెల్యేలు కూడా ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోయారు. ఏమీ పనులు కావడంలేదనే భావనలో ఎమ్మెల్యేలూ ఉన్నారు. జిల్లాలో పెద్దపెద్ద హామీలు ప్రధానంగా మార్కాపురం జిల్లా, వెలిగొండ ప్రాజెక్టు, జిల్లా డెయిరీ, ట్రిపుల్ఐటీ కాలేజీ, పెండింగు ప్రాజెక్టుల విషయంలో ఏమీ చేయలేకపోయామనే భావనలో ఉన్నారు. ఏ పనులు చేయాలన్నా నిధుల్లేకపోవడంతో ఇరకాటంలో పడ్డారు. సంక్షేమ ఎజెండా కూడా ఆశించినంత ఊపుగా లేదు. సూపర్‌సిక్స్ పథకాల్లో ఏడాదిగా ఒక్కటే అమలు జరిగితే తాజాగా తల్లికి వందనం అమలులోకి వచ్చింది. మిగతా వాటి కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామాల్లోకి వెళితే వీటిపై ఏం చెప్పాలో తెలియక ఎమ్మెల్యేలే అంతర్మథనం చెందుతున్నారు. అన్నీ హామీలు గానే ఉన్నాయి. ఈ మాటలు ఎంతకాలం చెబు తూ వద్దామనే చర్చ ఎమ్మెల్యేల మధ్య సాగుతోం ది. పాలన కూడా ఆశించినంత వేగంగా లేదనే చర్చ సాగుతోంది. అధికారులకు, ప్రజాప్రతినిధు లకు మధ్య సమన్వయం పూర్తిగా కనిపించడం లేదు. డిఆర్‌సీ వంటి ఉన్నతస్థాయి సమీక్షల్లో ఇది తెటతెల్లమవుతోంది. మంత్రి డోలావీరాంజనేయస్వామి పాలనపై తనదైన శైలిలో దృష్టిసారించి అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాలో కీలకమైన హామీలు అమలుపై దృష్టి సారించాల్సి ఉంది. పార్టీలో పరిస్థితులు పరిణామాలు అధినేతకు తెలియనివి కావు. పార్టీలో అంతర్గత వ్యవహారాలుగా భావించాలి. కూటమి ఏడాది పాలనపై మిశ్రమ స్పందనే వ్యక్తమవుతోంది.

'మార్గదర్శి'ల కోసం వెతుకులాట

(మొదటిపేజీ తరువాయి)

మార్గదర్శకులను గుర్తించడం, వారిని ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు అనుసంధానించాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వం మీద ఎలాంటి ఆర్థికభారం పడకుండా తమ సంపాదన నుంచి పేదల ఉద్ధరణ కోసం వ్యయాన్ని వెచ్చించగలగిన ధనవంతులను వెతికే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇందుకోసం ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత మండల స్థాయి అధికారులపై పెట్టారు. ఏడాది వార్షికాదాయం రూ.50 లక్షలకు మించి ఉండి.. చట్టబద్ధంగా పన్ను చెల్లించే వారినే మార్గదర్శులుగా నమోదు చేయాల్సి ఉంది. అలాగే బంగారు కుటుంబాలుగా పిలుస్తున్న పేదల అవసరాలు ఏమిటి.? వారికి ఎలాంటి ఆర్థిక చేయూత కావాలి.? వారు ఎలాంటి సహాయం కోరుతున్నారో గుర్తించి, ధనవంతులుగా ఉన్న మార్గదర్శులతో అనుసంధానించాల్సి ఉంది. ఇప్పటివరకు జిల్లాలో బల్లికురవ, జెపంగులూరు మండలాలల్లో మాత్రమే మార్గదర్శుల నమోదు పూర్తయ్యింది.

ఈ క్రమంలో ఇప్పటి వరకు చిన్న గొల్లపాలెం గ్రామానికి చెందిన యల్లావుల గణేష్ అనే విద్యార్థి చదువుల కోసం మార్గదర్శిగా ఉన్న విక్రమ నారాయణ ముందుకు వచ్చారు. చీరాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి చదువు కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పి4 ద్వారా ముందుకు వచ్చింది. కాగా ఇలాంటి ఆర్థిక చేయూత కార్యక్రమాలు సహజంగానే జరుగుతూ ఉంటాయి. కానీ గ్రామాల్లో పేదలుగా ఉన్న కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు చేపట్టవలసిన బృహత్ ప్రణాళికలు కార్యరూపం దాల్చడం కష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. మార్గదర్శులుగా ఉన్న ధనవంతులు పేద కుటుంబాలను దత్తత తీసుకొని లక్షల రూపాయలు వ్యయం చేసి వారి జీవన స్థితిగతులను సమూలంగా మార్చేందుకు ముందుకు వస్తున్న పరిస్థితి లేదని చెబుతున్నారు. చిన్నపాటి సాయాలు చేసేందుకు వారు సుముఖంగా ఉన్నారు. కానీ ఒక్కొక్కరు కొన్ని కుటుంబాలను పి4లో దత్తత తీసుకుని వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ధనవంతులుగా ఉన్న వారు ప్రభుత్వం నుంచి ఏదొక సాయాన్ని ఆశిస్తున్నట్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వంలో ఉన్న పెద్దలతో పనులు ఉన్నవారు మార్గదర్శులుగా ఉండేందుకు అంగీకరిస్తున్నారు. దీంతో పేదలను ఆదుకునే ధనవంతుల ఎంపిక అధికారులకు సవాల్‌గా మారింది. ప్రభుత్వం నుంచి ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో అధికారులు మండలాల్లో మార్గదర్శుల కోసం వెతుకులాట సాగిస్తూ జిల్లాలో పి4 బాలారిష్టాలను దాటే ప్రయత్నాలు చేస్తున్నారు.

'తల్లికి వందనం' పట్ల హర్షం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఒక తల్లికి ఎంత మంది బిడ్డలు ఉన్నప్పటికీ ప్రతి విద్యార్థి యొక్క తల్లి అకౌంటులో 13 వేల రూపాయలు నగదు గాను, 2 వేల రూపాయలు పాఠశాల మెయింటెనెన్స్ కింద జమ చేయడం పట్ల తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రెహమాన్, మండ్ల శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. పిల్లలకు పోషకాహార నిమిత్తం సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం ప్రాంతాల వారీగా భోజనం మెనూ అందించడం దేశంలో మన రాష్ట్రంలోనే అమలు చేయడం శుభ పరిణామమని వారు పేర్కొన్నారు.

'కూలి'న బతుకులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఇదే మండలంలోని గడ్డమీదపల్లి గ్రామానికి చెందిన నలుగురు కూలీలు మరొక రోడ్డుప్రమాదంలో మరణించారు. ఇప్పుడు అదే గ్రామానికి చెందిన మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. పని కోసం బయలుదేరితే తిరిగి ఇంటికే చేరకపోతున్నామని, ఇది తీవ్రంగా కలిచివేస్తోందని స్థానికులు వేదన వ్యక్తం చేశారు. కేవలం రోజుకు వంద రూపాయల సంపాదన కోసం దూరప్రాంతాలకు వెళ్లే కూలీలకు, కనీస రవాణా భద్రత కూడా లేకుండా ప్రాణాలు పణంగా మారుతున్నాయని వారంతా ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలను కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు. .

పాస్‌పోర్టు పోయినది

మార్కాపురం మండలంలోని బిరుదులనరవ గ్రామానికి చెందిన గుంటక శివారెడ్డి, తండ్రి: వెలుగొండారెడ్డి అనే వ్యక్తికి చెందిన పాస్‌పోర్టు పోయినది. 2025 మే 17వ తేదీన తిప్పాయపాలెంలోని బ్యాంకులో పని చూసుకుని బిరుదులనరవ గ్రామానికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మార్గం మధ్యలో జారిపోయినది. పాస్‌పోర్టు నెం: X6156258. ఎవరికైనా దొరికిన యెడల తమకు అందజేయగలరు.

గుంటక శివారెడ్డి,
బిరుదులనరవ గ్రామం,
మార్కాపురం మండలం,
సెల్: 7207635203.

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. 206/2023

రాచపూడి వెంకట నరసయ్య అలియాస్
జ్యోతి కుమార్ ...వాది

వర్సెస్

పువ్వాడ వెంకట శివప్రసాదరావు మరియు
నలుగురు ఇతరులు ...ప్రతివాదులు

టు,
డి:3: తిప్పిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, తండ్రి: వెంకటరెడ్డి, శివాజినగర్ 4వ లైన్, మార్కాపురం టౌన్.

పై నెంబరు దావాను వాది నీ పైన మరికొంతమంది పైన పై కోర్టులో స్పెసిఫిక్ పెర్ఫార్మెన్స్ దావాను దాఖలు చేసి ఉన్నారు. ఈ దావా నందు కోర్టు వారి ద్వారా మీకు ఎన్ని పర్యాయములు దావా సమనులు పంపిననూ తీసుకొనని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల వాయిదా 26-06-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు నీవుగానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులతో)
ఆర్.వి.నాగేశ్వరశాస్త్రి,
అడ్వకేట్, మార్కాపురం

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ. 218/2023
ఇన్
ఓ.ఎస్. 206/2023

రాచపూడి వెంకట నరసయ్య అలియాస్
జ్యోతి కుమార్ ...పిటీషనర్/వాది

వర్సెస్

పువ్వాడ వెంకట శివప్రసాదరావు మరియు
నలుగురు ఇతరులు ...రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

టు,
ఆర్:3: తిప్పిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, తండ్రి: వెంకటరెడ్డి, శివాజినగర్ 4వ లైన్, మార్కాపురం టౌన్.

పై నెంబరు దావాను వాది నీ పైన మరికొంతమంది పైన పై కోర్టులో స్పెసిఫిక్ పెర్ఫార్మెన్స్ దావాను దాఖలు చేసి ఉన్నారు. ఈ దావా నందు ఐ.ఎ. 218/2023 నెంబరున మధ్యంతర ఉత్తర్వులు కోరుచూ ఐ.ఎ.ను దాఖలు చేసి ఉన్నారు. ఈ ఐ.ఎ. నందు కోర్టు వారి ద్వారా ఐ.ఎ. నోటీసులు ఎన్ని పర్యాయములు పంపిననూ తీసుకొనని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల వాయిదా 26-06-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు నీవుగానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులతో)
ఆర్.వి.నాగేశ్వరశాస్త్రి,
అడ్వకేట్, మార్కాపురం

గ్రామపంచాయతీ కార్యాలయం, సూరవరపుపల్లి గ్రామము

యద్దనపూడి (మం), బాపట్ల జిల్లా

ఆర్.ఓ.సి.నెం 08/2025 **టెండరు ప్రకటన** **తేదీ: 14-06-2025**

బాపట్ల జిల్లా, యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామ పంచాయితీలో 01/07/2025 వ సంవత్సరం నుండి తేది 30-06-2026 సంవత్సరం వరకు ఒక్క సంవత్సరకాలంనకి పని చేయుటకుగాను ఈదిగువ తెలిపిన సిబ్బంది పని చేయుటకు సీలు వేసిన టెండర్లను తేది 21-06-2025 మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఈ దిగువ సంతకం దారు వద్ద గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని సూరవరపుపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద స్వీకరించబడును సదరు సీలు వేసిన టెండర్లను అదే రోజు అదే ప్రదేశంలో మధ్యాహ్నం 3.30 గంటలకు హాజరైన టెండరుదారులు సమక్షంలో టెండర్లు తెరువ బడును, ఆసక్తి గలవారు. ఆయా అయిటంకు ఎదురుగా చూపబడిన ధరావత్తు చెల్లించి టెండరులో పాల్గొనవచ్చును. ధరావత్తు చెల్లించనిమరియు సకాలంలో దాని టెండరులు స్వీకరించబడవు. ఏ కారణం చూపకుండానే టెండర్లు వాయిదా వేయుటకులేదా రద్దు పరుచుటకు పంచాయితీ కార్యదర్శికి అధికారం కలదు. మిగిలిన విషయాలు ఆఫీసు పని వేళలలో అడిగితెలుసుకొనవచ్చును.

వ.సం	సరఫరా వివరములు	చెల్లించవలసిన ధరావత్తు మొత్తం రూ.
1)	01-07-2025 వ సం॥ నుండి 30-06-2026 వరకు ఎలక్ట్రిషియన్ రోజు కూలిపై పనిచేయుటకు (ఒకరు)	రూ. 100/-
2)	01-07-2025 వ సం॥ నుండి 30-06-2026 వరకు స్వీపరు రోజువారీ కూలిపై పనిచేసేందుకు (ఒకరు)	రూ. 100/-
3)	01-07-2025 వ సం॥ నుండి 30-06-2026 వరకు టర్న్‌కాక్‌గా పనిచేయుటకు ఒకరు	రూ. 100/-

గమనిక: 1.పంచాయితి నిధులు సమృద్ధిగా ఉన్నప్పుడు మాత్రమే చెల్లింపులు చేయబడును.
2. టెండర్లకు సంబంధించిన ఏ విషయంలోనైననూ, ఏ న్యాయస్థానంలో ఫిర్యాదు చేయరాదు.
3. పంచాయితీ కార్యదర్శి గారిచే ఎప్పటికప్పుడు జారి చేయబడు ఆదేశాలను టెండరుదారు తప్పక పాటించవలెను.

సం/- **తేజ శివప్రసాద్**, పంచాయతి కార్యదర్శి, సురవరపుపల్లి గ్రామ పంచాయతీ, యద్దనపూడి మండలం, బాపట్ల జిల్లా.

గ్రామ పంచాయితీ - అల్లూరు గ్రామము

కొత్తపట్నం మండలం, ప్రకాశం జిల్లా

ఆర్.సి.నెం. 1/2025 **టెండర్ ప్రకటన** **తేది: 14-06-2025**

కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామపంచాయితీ నందు తేది: 01-07-2025 నుండి 31-06-2026 వరకు సంవత్సర కాలమును ఈ దిగువ పనులకు నెలవారి కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు తేది: 23-06-2025 ఉదయం 11.00 గంటలకు సీల్డు టెండర్లు స్వీకరించబడును మరియు అదే రోజు సాయంత్రం 3.00 గంటలకు టెండరు దారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. ఆసక్తి కలవారు టెండరు ధరఖాస్తుకు 500/-లు రశీదు జతపరచవలెను. ఏ కారణము చూపకనే టెండర్లు రద్దు చేయుటకు మరియు వాయిదా వేయుటకు గ్రామ పంచాయతీకి పూర్తి అధికారం కలదు.

వ.నెం	పని వివరములు	వర్తించు కాలము	సంఖ్య	ధరావత్తు
1.	ట్రాక్టర్ డ్రైవర్	01-07-2025 నుండి 31-06-2026 వరకు	2	500
2.	టెర్నెకాక్	01-07-2025 నుండి 31-06-2026 వరకు	1	500
3.	స్వీపర్	01-07-2025 నుండి 31-06-2026 వరకు	1	500
4.	క్లాప్‌మిత్ర స్వీపర్లు	01-07-2025 నుండి 31-06-2026 వరకు	7	500
5.	ట్యాంక్ వాచర్	01-07-2025 నుండి 31-06-2026 వరకు	2	500
6.	ఇంజన్ డ్రైవర్	01-07-2025 నుండి 31-06-2026 వరకు	1	500
7.	ఎలక్ట్రీషియన్	01-07-2025 నుండి 31-06-2026 వరకు	1	500

నిబంధనలు : 1) కాంట్రాక్టు సంవత్సర కాలం వరకు 01-07-2025 నుండి 31-06-2026 వరకు
2) గ్రామ పంచాయితీ నిధుల సౌలభ్యతను బట్టి మాత్రమే వేతనములు చెల్లించబడును.
3) కాంట్రాక్టు రద్దు చేయుటకు గ్రామపంచాయితీకి అధికారము కలదు.
4) కాంట్రాక్టు పని సంతృప్తి లేనియెడల అతని స్థానంలో వేరొకరిని నియమించు అధికరం గ్రామ పంచాయితీ వారికి కలదు.
5) పనిచేయు కాలము బట్టి వేతనమును నిర్ణయించబడును
6) గ్రామ పంచాయితీ బైలా ప్రకారం కార్మికులను తీసుకోబడును.
7) ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయస్సు పరిగణలోకి తీసుకోబడును

షరతులు వర్తిస్తాయి.

పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, అల్లూరు.

సర్పంచ్ గ్రామపంచాయితీ
గ్రామపంచాయతీ, అల్లూరు.

గ్రామ పంచాయితీ కార్యాలయం, జాగర్లమూడి గ్రామము

యద్దనపూడి మండలం, బాపట్ల జిల్లా,

ఆర్.ఓ.సి.నెం 04/2025 **టెండరు ప్రకటన** **తేదీ: 12-06-2025**

బాపట్ల జిల్లా, యద్దనపూడి మండలం, జాగర్లమూడి గ్రామ పంచాయతీలో తేది. 01-07-2025సంవత్సరం నుండి తేదీ. 30-06-2026వ సంవత్సరం వరకు ఒక సంవత్సర కాలానికి పనిచేయుటకు గాను ఈ దిగువ తెల్పిన సిబ్బంది పనిచేయుటకు సీలు వేసిన టెండర్లను తేదీ: 23.06-2025 ఉదయం 10.00గం. లకు వరకు ఈ దిగువ సంతకం దారు వద్దగాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని జాగర్లమూడి గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద స్వీకరించబడును. సదరు సీలు వేసిన టెండర్లను అదే రోజు అదే ప్రదేశములో ఉదయం గం. 10.30 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. ఆసక్తిగలవారు ఆయా అయిటంకు ఎదురుగా చూపబడిన ధరావత్తు చెల్లించి టెండరులో పాల్గోనవచ్చును, ధరావత్తు చెల్లించని మరియు సకాలంలో దాని టెండర్లు స్వీకరించబడవు. ఏ కారణం చూపకుండానే టెండర్లు వాయిదా వేయుటకు లేదా రద్దు చేయటకు పంచాయితీ కార్యదర్శికి అధికారం కలదు. మిగిలిన విషయాలు ఆఫీసు పనివేళలో అడిగితెలుసుకొనవచ్చును.

వ.సం	సరఫరా వివరములు	చెల్లించవలసిన ధరావత్తు మొత్తం రూ.
1)	తేదీ :- 01-07-2025 సం॥ నుండి 30-06-2026 వరకు	
	స్వీపర్ రోజువారీ కూలీ పై పని చేయుటకు	రూ 100/-
2)	తేదీ :- 01-07-2025 సం॥ నుండి 30-06-2026 వరకు	
	ఎలక్ట్రిషన్ రోజు కూలి పై పనిచేయుటకు	రూ100/-
3)	తేదీ :- 01-07-2025 సం॥ నుండి 30-06-2026 వరకు	
	చెరువు కాపలాదారుడు రోజు కూలి పై పనిచేయుటకు	రూ 100/-
4)	తేదీ :- 01-07-2025 సం॥ నుండి 30-06-2026 వరకు	
	వరకు టర్న్ కాక్ రోజువారి కూలి పై పనిచేయుటకు	రూ 100/-

గమనిక:- 1. పంచాయితి నిధులు సమృద్ధిగా ఉన్నప్పుడు మాత్రమే చెల్లింపులు చేయబడును.
2. టెండర్లకు సంబంధించిన ఏ విషయంలోనైననూ, ఏ న్యాయస్థానంలో ఫిర్యాదు చేయరాదు.
3. పంచాయితీ కార్యదర్శి గారిచే ఎప్పటికప్పుడు జారి చేయబడు ఆదేశాలను టెండరుదారు తప్పక పాటించవలెను.

సం/- **వై. శరత్ కుమార్**, పంచాయతి కార్యదర్శి, జాగర్లమూడి గ్రామ పంచాయతీ, యద్దనపూడి మండలం, బాపట్ల జిల్లా.

ప్రజాశక్తి
సోమవారం 16 జూన్ 2025

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

విద్యుత్ తీగ తెగిపడటంతో చెలరేగిన మంటలు

పరిశీలించిన విద్యుత్‌శాఖ అధికారులు

ప్రజాశక్తి-సిఎస్.పురం

విద్యుత్ తీగ తెగపడి ఇల్లు ధ్వంసమైన సంఘటన చంద్రశేఖరపురం మండలంలోని కోవిలంపాడు గ్రామంలో ముస్లిం కాలనీలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కోవిలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ముస్లిం కాలనీ ఇండ్ల మీదుగా ఆనికాళ్లపల్లి 11 కేవి విద్యుత్తు లైను ఉంది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో షేక్.మస్తానమ్మ ఇంటి ముందు విద్యుత్ తీగ ఒక్కసారిగా తెగి పడటంతో ఇంట్లో మంటలు చెలరేగి పాక్షికంగా ఇల్లు దెబ్బతిన్నది. అలాగే ఇంట్లోని మంచము, సైకిల్, కుర్చీలు, బట్టలు, వాషింగ్ మిషన్, టీవీ, కూలర్ మరియు వివిధ వస్తువులు సుమారు రూ.60వేల సామాగ్రి దగ్ధమైనట్లు షేక్.మస్తానమ్మ మరియు కాలనీ వాసులు తెలిపారు. కాలనీలో సుమారు 60 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. విద్యుత్ ప్రమాదాలతో చాలాచోట్ల నివాస గృహాల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయినట్లు సమాచారం. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. అగ్ని ప్రమాదానికి గురైె ఇంటిలో వస్తువులు కాలిపోవడంతో షేక్.మస్తానమ్మ కుటుంబానికి కాలనీలో నష్టపోయిన నివాస గహాల్లోని ఎలక్ట్రానిక్ వస్తువులను పరిశీలించి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కాలనీవాసులు కోరారు. ఈ విషయము తెలుసుకొని ఒంగోలు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్.రజ్జాబ్‌బాషా మరియు కాలనీ వాసులు వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. విద్యుత్ ఎడి కష్ణారెడ్డి, పామూరు ఏఇ, సిఎస్.పురం ఇన్‌చార్జి షేక్.జిలాని, ఎల్‌ఐ కరుణాకర్, జేఎల్‌ఎం నారాయణ వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి లైను మార్చుటకు స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలియపరిచామని ఇంతవరకు ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఇంటిపై నుంచి విద్యుత్తు తీగలను, కరెంటు స్తంభాలను తొలగించి ఊరి బయట ఖాళీ స్థలాలలో గుండా విద్యుత్తు లైను ఏర్పాటు చేయాలని అధికారులను గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా విద్యుత్తు ఏడి కష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ కాలనీ ఏర్పడక ముందు విద్యుత్తు లైను వేశారని, విద్యుత్తు లైను ఉండగానే ఇల్లు నిర్మాణం చేపట్టారని అన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఇలాగే కొనసాగుతున్నదని తెలిపారు. ఈ ప్రదేశం నుంచి విద్యుత్తు స్తంభాలు మార్చుటకు సుమారు 12 స్తంభాలు అవసరమవుతాయని ఈ విషయాన్ని ఆర్‌డిఎస్‌ఎస్ అధికారులకు ప్రపోజల్ పంపించామని మంజూరైన వెంటనే విద్యుత్ స్తంభాలు మారుస్తామని తెలిపారు.

కాలిపోయిన సామాన్లు

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

శింగరాయకొండ స్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ సర్కిల్, పోలీస్ స్టేషన్‌లను ఆదివారం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ ఆవరణ, గదులను, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించి, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా మరియు ఆహ్లాదంగా ఉండే విధంగా చూడాలన్నారు. స్టేషన్ నిర్వహణ రికార్డులు మరియు పలు రికార్డులను తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేసారు. విచారణలో ఉన్న కేసుల యొక్క పురోగతి, దర్యాప్తు ఏ విధంగా జరుగుతున్నది మొదలగు అంశాలను గూర్చి తెలుసుకున్నారు. దర్యాప్తులో ఉన్న కేసులలో సత్వరమే దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. మహిళలు, చిన్నారుల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలి. సర్కిల్ పరిధిలో గ్రామాలలో పోలీస్ అధికారులు తరచూ పర్యటిస్తూ అక్కడి సమస్యలను పరిష్కరించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని, దొంగతనాలు, గొడవలు నివారణ కొరకు పాత నేరస్తుల, చెడు నడత వారి యొక్క కదలికలపై నిఘా ఉంచాలని, ప్రతిరోజు విజిబుల్, ఫ్రెండ్లీ పోలిసింగ్ నిర్వహించాలని అన్నారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించి త్వరగా సంబంధిత అధికారుల అనుమతి తీసుకొని డిస్పోజల్ చేయాలన్నారు. సర్కిల్ పరిధిలో ప్రజలకు సైబర్ మోసాలపై, మాదకద్రవ్యాలపై జరుగు అనర్ధాలపై, రోడ్డు భద్రత నియమాలు మరియు హెల్మెట్ పై అవగాహన, సీసీ కెమెరాలు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే వాటిని ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన వారితో ముందుగా మర్యాదపూర్వకంగా, కుటుంబ సభ్యులవలె మాట్లాడి వారి సమస్యకు పరిష్కార మార్గం చూపాలన్నారు. విధుల పట్ల అంకితభావంగా ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో వుంటూ ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. ఎస్పీ వెంట ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, శింగరాయకొండ సిఐ హాజరత్తయ్య, ఆర్‌ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఎస్సై మహేంద్ర ఉన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పి దామోదర్

చిల్లచెట్లతో మూసుకుపోయిన రోడ్డు

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

సి.ఎస్ పురం నుంచి కనిగిరి వెళ్లే రహదారిలో రామాపురం వద్ద రహదారి ముళ్లచెట్లతో మూసుకుపోయింది. దీంతో రాకపోకలు సాగించేందుకు అవస్థలకు తప్పడం లేదు. సిఎస్‌పురం నుంచి కనిగిరి వెళ్లేందుకు ప్రజలకు ఈ రోడ్డు అనువుగా ఉంటుంది. రైతులు కూడా రహదారిలోనే పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చిల్లచెట్లతో మూసుకుపోయిన రహదారి

రోడ్డును పూర్తిగా కమ్మేసిన చెట్లు

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం

రోడ్లపై పారుతున్న మురుగు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్

మండలంలోని డిజిపేటలో పారిశుధ్యం నిర్వహణ పట్ల పంచాయతీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. పారిశుధ్యం నిర్వహణ పేరుతో నిధులను ఖర్చు చేస్తున్నారే కానీ పరిశుభ్రత మాత్రం మెరుగు పడడం లేదు. ప్రధానంగా సచివాలయం ముందు మురికి నీరు కాలువలా పారుతున్నా పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రతినిత్యం అధికారులు విధులు నిర్వహించే కార్యాలయం ముందే పారిశుధ్యం అధ్వానంగా ఉన్నా మెరుగుకు చర్యలు చేపట్టకపోవడం పట్ల ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు

రోడ్డుపైకి వచ్చిన మురుగు నీరు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని తోకపల్లి గ్రామంలో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం లభ్యమైంది. మృతి చెందిన వ్యక్తి వయసు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎత్తు 5.3 అడుగులు ఉన్నాడని, బ్లూ ఫ్యాంటు, గ్రీన్, బ్లాక్ కలర్ కలిగిన షర్టు ధరించి ఉన్నాడని ఎస్ఐ పి.అనిల్ కుమార్ తెలిపారు. తెలిసినవారు సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పెద్దారవీడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం

చికిత్స పొందుతున్న బాధితురాలు

ఒంటరి మహిళపై దాడిచేసి..

బంగారు గొలుసు అపహరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక ప్రభుత్వాసుపత్రి లైనులో నివాసముంటున్న గోలి పద్మజ (50)పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఆమె నుండి మూడు సవర్ల బంగారాన్ని దోచుకుని వెళ్లారు. అందిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం రోడ్డులో ఎవరు లేని సమయంలో ఆమె నివాసంలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు మరియు కమ్మలు లాక్కొని పోవాలని ప్రయత్నించారు. పెద్దగా కేకలు వేయడంతో పక్కనే ఉన్న కర్రతో దుండగులు ఆమె తలపై బాదారు. బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. స్థానికులు బాధితురాలిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానిక సీఐ ఎం.సుబ్బారావు, ఎస్ఐ కృష్ణయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీము సంఘటన స్థలాన్ని సందర్శించి వేలిముద్రలు సేకరించింది. జాగిలం కెనరా బ్యాంక్ వరకు వెళ్లి ఆగిపోయింది. అయితే ఇటీవల పట్టణంలో ఒక వ్యక్తి కాషాయ రంగు దుస్తులు ధరించి జాతకాలు చెబుతామని ఇంటింటికీ తిరుగుతున్నాడు. ఆ వ్యక్తి తన బ్యాచ్‌తో కలిసి దొంగతనానికి పాల్పడ్డాడని పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు సీసీ కెమెరాలో కూడా ఆ వ్యక్తిని గుర్తించినట్టు తెలిసింది. పోలీసులు పట్టణంలో దుండగుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఇటీవల పట్టణంలో గుర్తుతెలియని వ్యక్తులతో పాటు, పలువురు అనుమానితులు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది.

మొబైల్ అందజేత

ప్రజాశక్తి-సిఎస్.పురం

సీఎస్‌పురం మండలం పెదగోగులపల్లి గ్రామానికి చెందిన గోగడి వెంకట నారాయణ చౌదరి మే నెల 15 తారీకు తన మొబైల్ ఫోను పోగొట్టుకున్నట్లు సిఎస్.పురం పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లునాయక్ సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి పోయిన మొబైల్ ఫోన్‌ని రికవరీ చేశారు. ఆదివారం వెంకటనారాయణకు ఫోనును అప్పగించారు.

కంప్యూటర్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పీసీపల్లి

సచివాలయంలో పనిచేయని కంప్యూటర్లు అనే శీర్షికన ఆదివారం ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వార్తకు స్పందించిన పిసిపల్లి డిప్యూటీ ఎంపీడీవో ఎస్.రాం ప్రసాద్ మాట్లాడుతూ కంప్యూటర్లు మరమ్మతుల కోసం పంపించామని, త్వరలో రిపేరు చేయించి అందుబాటులో వుంచుతామని తెలిపారు. లెనోవా కంపెనీకి సంబంధించిన కంప్యూటర్లు కావడంతో వాటికి అవసరమైన స్పేర్ పార్టులు అందుబాటులో లేక కొంత ఆలస్యం అయిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

- నిబంధనల పేరుతో తల్లికి వందనంలో కోతలు వద్దు
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి
- ముగిసిన సిపిఎం శిక్షణా తరగతులు

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి

ప్రజాశక్తి - చీరాల

ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఏడాది సుపరిపాలనని కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రచారం చేసుకోవడం ప్రజలను మోసం చేయటమేనని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి ఆరోపించారు. స్థానికంగా జరుగుతున్న సిపిఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజలను భాష, ప్రాంతం పేరుతో విడగొడుతుందని ఆరోపించారు. రాష్ట్రాల హక్కులు హరిస్తుందని అన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని అన్నారు. విడిపోయిన ఆంధ్ర రాష్ట్రంకు నిధులు ఇవ్వకుండా కేంద్రం మోసం చేస్తుంటే ఏడాది పాలనలో కేంద్రం ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నోరు మెదప కుండా మోడీ భజన చేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నట్లు ప్రచారం చేసుకొంటూ ప్రకటనలు ఘనంగా చేసుకొంటున్నాని అన్నారు. రాష్ట్రంలో నూతన మెడికల్ కాలేజీలు ప్రవేట్ పరం చేయటం అంటే ప్రైవేటుకు రెడ్ కార్పెట్ పరిచడమేనిని విమర్శించారు. తెలుగుదేశం కూటమి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం 'తల్లికి వందనం' నగదు అర్హుల్కైన విద్యార్థులు అందరికీ నిబంధనలు సడలించి తల్లుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అడ్డగోలు నిబంధనలతో 9లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని అన్నారు. ఆదాయ పరిమితిని సడలించి గ్రామాల్లో రూ.2.5లక్షలు, పట్టణాల్లో రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలన్నింటికీ 'తల్లికి వందనం' వర్తింప జేయాలని కోరారు. ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ, ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతి, ఇంటర్ అడ్మిషన్లు అయిన వెంటనే వారికి నగదు చెల్లించాలని అన్నారు. స్కీం వర్కర్స్, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని వర్తింప చేయాలని కోరారు. గత ప్రభుత్వం విధించిన షరతులను విమర్శించిన టిడిపి ఇప్పుడు అధికారానికి వచ్చిన తర్వాత అంతకుమించిన షరతులుపెట్టి నగదు కూడా తగ్గించడం సరికాదని అన్నారు. రూ.15వేలు నేరుగా తల్లులకు చెల్లిస్తామని ప్రస్తుతం రూ.2వేలు మినహాయించారని అన్నారు. అయితే కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా ఇస్తామని చెప్పి, ఫీజు రీ ఎంబర్స్ మెంట్ పొందుతున్న కుటుంబంలోని విద్యార్థులకు ఈ పథకం అమలు కాకుండా మినహాయించడం హామీ ఉల్లంఘనే అన్నారు. ఇంత వరకు ఫీజురియంబర్స్‌మెంట్ ఎవరికీ ఇవ్వకుండానే ఆ పేరుతో తల్లికి వందనంపై కోత విధించడం అన్యాయం అన్నారు. విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న పిల్లల తల్లులకు కాకుండా నేరుగా స్కూళ్ల మేనేజ్‌మెంట్ ఖాతాలకు చెల్లించి ప్రభుత్వ విద్యను దెబ్బతీసే కుట్ర మానుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం అఖిల భారత మహాసభలు కర్తవ్యాల అమలుపై సిపిఎం కార్యకర్తలకు ఆమె వివరించారు. మొదటగా సిపిఎం రాష్ట్ర నాయకులు పి ఆంజనేయులు సిపిఎం రాజకీయ వైఖరిని వివరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి కృష్ణ మోహన్, ఎన్ బాబురావు, సిహెచ్ మణిలాల్, జిల్లా కమిటీ సభ్యులు కొండయ్య, టి వెంకటేశ్వర్లు, ఎం ఆంజనేయులు, తిరుమల, వసంతరావు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులకు హాజరైన సిపిఎం కార్యకర్తలు

రెడ్ క్రాస్ చైర్మన్‌గా శశికిరణ్ ఎన్నిక

ప్రజాశక్తి- చీరాల

బూదరాజు శశికిరణ్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చీరాల బ్రాంచ్ చైర్మన్‌గా న్యాయవాది బూదరాజు శశికిరణ్ ఎన్నికయ్యారు. రెడ్‌క్రాస్ బ్రాంచి సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ హాలులో తహశీల్దారు గోపికృష్ణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. బ్రాంచి మేనేజింగ్ కమిటీ సభ్యులుగా బూదరాజు శశి కిరణ్, దాసరి ఇమ్మనియేలు, డాక్టర్ ఐ బాబురావు, డాక్టర్ తాడివలస కుమార్, సూరంపల్లి తేజస్వి, మంకెన మణి బాబు, త్రోవగుంట అబ్దుల్, జంగిలి వెంకట సాయి కృష్ణ, మద్దిన వెంకటేశ్వర్లు, సిహెచ్ రాం ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో రెడ్ క్రాస్ చీరాల చైర్మన్‌గా బూదరాజు శశికిరణ్, వైస్ చైర్మన్‌గా డాక్టర్ ఐ బాబురావు, వైస్ ప్రెసిడెంట్ సూరంపల్లి తేజస్వి, కోశాధికారి దాసరి ఇమ్మానియేలు, కార్యదర్శి జివివి ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ఎన్నికల పరిశీలకులు డాక్టర్ వీర రాఘవయ్య, ప్రసాదరెడ్డి, ఎన్నికల అధికారులుగా బోయిన శ్రీనివాసులు, టిజె సాయి బాబు, జివివి ప్రసాద్ వ్యవహరించారు.

ఇంకొల్లు విద్యార్థినికి నీట్ ర్యాంక్

ప్రజాశక్తి - ఇంకొల్లు

మన్విత మహాలక్ష్మి

ఇంకొల్లుకు చెందిన జాగర్ల మూడి మన్విత మహాలక్ష్మి నీట్ పరీక్షా ఫలితాల్లో 534 మార్కులు సాధించి ఆల్ ఇండియా విభాగంలో 20941 ర్యాంకు, జనరల్ కేటగిరిలో 8556 ర్యాంకు సాధించారు. విజయ వాడ శ్రీ చైతన్య కళాశాల్లో ఇంటర్ చదివారు. ఆమె తండ్రి వేణుబాబు ఇంకొల్లులో బాలాజి మెస్ నిర్వహిస్తున్నారు. తల్లి సీతాదేవి గృహిణి. మన్విత మహాలక్ష్మి భవిష్యత్తులో మంచి డాక్టర్ కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివానని తెలిపారు. మహాలక్ష్మికి ర్యాంకు రావటం పట్ల తల్లి, దండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న న్యాయవాది టిఎం శ్రీను

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - అద్దంకి

ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవధికారి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల అవగాహన దినోత్సవం సందర్భంగా సింగరకొండలోని శ్రీ రామా వృద్ధాశ్రమంలో చట్టాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉచిత న్యాయ సహాయ న్యాయవాదులు టి మార్తాశీను, ఎం ప్రకాష్, షేక్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ వృద్ధుల హక్కులు, సమాజంలో వృద్ధులు గౌరవంగా జీవించడానికి అవసరమైన చట్టాల గురించి వివరించారు. తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత కొడుకులపై ఉందని చెప్పారు. వృద్ధులను ఇబ్బంది పెడితే శిక్షార్హులు అవుతారని చెప్పారు. కార్యక్రమంలో శ్రీరామ వృద్ధాశ్రమం నిర్వాహకులు రావూరి రంగయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - అద్దంకి

మున్సిపాలిటీ పరిధిలోని నంబూరుపాలెం, మౌలానగర్‌లోని విద్యుత్ వినియోగదారులకు సోమవారం పాత విద్యుత్తు లైన్ల మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు డిఇ ఎం దామోదరం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని కోరారు.

టిడిపి కూటమి నేతలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - పంగులూరు

కూటమి ప్రభుత్వ నేతలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఎన్నికల హామీల్లో భాగంగా తల్లికి వందనం విజయవంతంగా అమలు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్ చిత్రపటాలకు మండలంలోని ముప్పవరం దళిత కాలనీలోని చిన్నారులు ఆదివారం పాలాభిషేకం చేశారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ పాలాభిషేకం నిర్వహించారు. తెలుగుదేశం గ్రామ అధ్యక్షులు వేల్పుల మరియదాసు అధ్యక్షతన కాలనీలోని చర్చి దగ్గర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు అల్లంనేని బ్రహ్మానంద స్వామి, గరిమిడి జగన్మోహనరావు, ఇంటూరి రామకృష్ణ, ఉదయగిరి శివశంకర్, తిరుమల శెట్టి వీరాంజనేయులు, బావన్నారాయన, వేల్పుల సామేలు, స్థానిక తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

యోగాంధ్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వేమూరు

ఈనెల 21న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా విశాఖపట్టణంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమానికి దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరవుతున్నారని శాసన సభ్యులు నక్క ఆనందబాబు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. భోగాపురం, పోలిపల్లిలో భూమాతా లేఔట్ నందు కార్యకర్తలకు ఆదివారం అవగాహన సమావేశంలో పరిశీలకులుగా ఆయన మాట్లాడారు. ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు మహమ్మద్ నజీర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక కవితా సారధి శ్రీశ్రీ

శ్రీశ్రీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బాపట్ల

తెలుగు ఆధునిక అభ్యుదయ సాహిత్యంలో శ్రీశ్రీ సరికొత్త ప్రభంజనం సృష్టించారని ప్రజాకవి ఎస్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక జమేదారుపేటలోని సాహితీ భారతి కార్యాలయంలో ఆదివారం జరిగిన శ్రీశ్రీ 42వ వర్ధంతి సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహాప్రస్థానం, ఖడ్గసృష్టి వంటి కవితా సంపుటాలు నేటికీ తెలుగు కవుల్లో నూతన స్ఫూర్తిని నింపుతున్నాయని అన్నారు. సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ మాట్లాడుతూ శ్రీశ్రీ 'కదిలేది, కదిలించేది, పెను నిద్దుర వదిలించేది, పరిపూర్ణ బ్రతుకిచ్చేది కావాలోయ్ నవ కవనానికి' అని ఆధునిక కవిత్వానికి సరికొత్త నిర్వచనం ఇచ్చారని అన్నారు. సాహితీ భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావు మాట్లాడుతూ శ్రీశ్రీ తన కవిత్వంలో కార్మిక, కర్షక జీవితాల కష్టాలు, కన్నీళ్లను ఆవిష్కరించారని అన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదంషఫీ మాట్లాడుతూ శ్రీశ్రీ దాదాపు 280 చిత్రాలకు వేయికి పైగా పాటలు రచించారని అన్నారు. ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, దగ్గుమల్లి శామ్యూ ల్, బొడ్డుపల్లి శ్రీరామ చంద్రమూర్తి, కాళిదాసు పాల్గొన్నారు.

చీరాల : నవ్యాంధ్ర చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఘంటసాల విగ్రహం వద్ద మహాకవి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఆదివారం నివాళి అర్పించారు. గాదె హరిహరరావు, ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి, అప్పన్నరెడ్డి, సూర్యనారాయణ, గోలి జేజిబాబు, శామ్యూల్‌రాజు, ఎస్‌కె సుభాని, చెంగల్వ కృష్ణ పాల్గొన్నారు.

చీరాలలో శ్రీశ్రీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

బాలికలను పాఠశాల్లో చేర్పిస్తున్న దేవతోటి బుల్లెమ్మాయి

కిషోర వికాసంతో విద్యా వికాసం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని వేటపాలెం ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలోని నాయనపల్లి 4వ అంగన్‌వాడీ కేంద్రంలో ఇద్దరు బాలికలను చేర్పించారు. మే 2 నుండి జూన్ 10 వరకు కిషోర వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. బడి మానివేయటం వల్ల జరిగే అనర్థాలు బాలికలకు వివరించారు. అందుకు స్పందించిన వీరిశెట్టి సౌమ్యలత 9వ తరగతి, వలివేటి అక్షర 10వ తరగతికి వేటపాలెం జడ్పీ హై స్కూల్ హెచ్‌ఎం సరోజిని ప్రవేశం కల్పించారు. ప్రోత్సహించి, స్కూల్లో చేర్పించడంలో కృషి చేసిన అంగన్‌వాడీ కార్యకర్త దేవతోటి బుల్లెమ్మాయిని సిడిపిఓ టి ఝాన్సీ, సూపర్వైజర్ సజ్జ పుష్పవల్లి అభినందించారు.

వేతన బకాయిలు చెల్లించాలి

104 ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

104 ఉద్యోగుల వేతన బకాయిలు, ఇఎల్ గ్రాట్యుటీలను తక్షణమే చెల్లించాలని 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఆదివారం నాడు స్థానిక సిఐటియు కార్యాలయంలో సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో గౌరవాధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ



మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

ఆంధ్రప్రదేశ్‌లో 104 సర్వీస్‌లను గతంలో అరబిందోయాజమాన్యం నిర్వహించిందన్నారు. సంస్థ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ప్రస్తుతం 104 సర్వీస్‌లు నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్తగా నియామకాలు చేపట్టాలని కోరారు. 2020 జులైలో జాయిన్ అయిన ఉద్యోగులకు కూడా స్లాబ్ సిస్టమ్ అమలు చేయాలన్నారు. గత ఐదు సంవత్సరాల నుండి మరమ్మతులకు నోచుకోని వాహనాలను వెంటనే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ప్రతి నెలా అన్ని జిల్లాల్లో కూడా గ్రీవెన్స్ మీటింగ్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. 104 వాహనాల్లో క్షయ పరీక్షలకి సంబంధించిన నమూనాల రవాణా మంచిది కాదని పేర్కొన్నారు. టిబి రక్త నమూనాల రవాణాతో వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని, ప్రభుత్వం పునరాలోచించి దీనిని నియంత్రించాలని కోరారు.

పశువుల దాహం తీరుస్తున్న నీటి తొట్టెలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని మురారిపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన పశువుల నీటి తొట్టెలు స్థానిక పశుపోషకులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. మునుపటి రోజుల్లో పశువులు తాగునీటి కొరతతో అటవీ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. వాటి తిరుగు ప్రయాణం వరకు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవి. ఈ క్రమంలో పశువుల నడక దారుల్లోనే నీటి తొట్టెలను నిర్మించడం వల్ల వాటికి మధ్యంతరంగా తాగునీరు అందుతోంది. ఈ ఏర్పాట్లతో పశువులు ఇబ్బందులు ఇంటికి చేరుతున్నాయి. ఈ విషయంపై మురారిపల్లి గ్రామ టిడిపి నాయకులు మేగడం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు నీటి తొట్టెలను నింపుతూ పశువులకు అందుబాటులో ఉంచుతున్నామని, దీంతో

నీటి తొట్టిలో నీళ్లు తాగుతున్న పశువులు

వాటికి తాగునీటి కొరత తలెత్తకుండా ఉంటోందని పేర్కొన్నారు. ఈ నీటి తొట్టెలు పశువుల ఆరోగ్య రక్షణకు ఒక వరం లాంటివి అని తెలిపారు. ప్రభుత్వం ఉపాధి పనుల నిధులతో పశువుల నీటి తొట్టెలను నిర్మించడం గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఒకవైపు ఉపాధి అవకాశాలు అందించడమే కాదు, మరోవైపు పశుసంవర్ధనను ప్రోత్సహించేలా అవి ఉపయోగపడుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

హత్య కేసులో రూ.8.25 లక్షల రిలీఫ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

చీమకుర్తికి చెందిన దేవరకొండ రత్తమ్మ హత్య కేసులో బాధిత కుటుంబానికి రూ.8.25 లక్షల రిలీఫ్‌ను కలెక్టర్ తమీమ్అన్సారియా మంజూరు చేశారు. చిన్న కుమార్తె పాలపర్తి దుర్గకు ప్రభుత్వ ఉద్యోగం, పెద్ద కుమార్తె పేరం నాగమణికి ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ మంత్లీ మంజూరైంది. చీమకుర్తి పట్టణంలో నివసించే దేవరకొండ రత్తమ్మ అనే ఎస్‌టి ఎరుకుల కులానికి చెందిన మహిళ బిసి కులానికి చెందిన మరొక వ్యక్తితో సహజీవనం చేసేది. ఈ క్రమంలో 2022 సంవత్సరం ఫిబ్రవరి 14 న దేవరకొండ రత్తమ్మ హత్య జరిగింది. మొదట ఈ కేసు ను చీమకుర్తి పోలీస్ వారు సాధారణ హత్య కేసు గా నమోదు చేశారు. హతురాలి కుమార్తెలు తమకు న్యాయం చేయాలని దళిత నేత నీలం నాగేంద్ర రావుని ఆశ్రయించారు. చీమకుర్తి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించి అప్పటి ఒంగోలు డిఎస్‌పితో నీలం నాగేంద్ర రావు మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి కులానికి చెందిన వారు ఎవరైనా ఇతర కులాల వారితో హత్యకు గురైతే ఎస్‌సి, ఎస్‌టి చట్టం వర్తిస్తుందని డిఎస్‌పికి వివరించారు. ఎస్‌సి, ఎస్‌టి కోర్టులో విచారణ జరిగి ఈ కేసులో నిందితుడైన గజ్జల శీనుకు గత ఏడాది యావజ్జీవ శిక్ష కోర్టు విధించారు. వివాహాలై వేరే కాపురాలు చేస్తున్న కుమార్తెలకు ఉద్యోగం పెన్షన్ ఇవ్వడానికి నిబంధనల పేరుతో కలెక్టరేట్ అధికారులు కొర్రీలు వేయటంతో చీమకుర్తి తహశీల్దార్ మూడు సార్లు పంపించిన రిపోర్ట్‌ను వెనక్కి పంపించారు. దళిత నేత నీలం నాగేంద్ర రావు కలెక్టర్ తమీమ్ అన్సారియా, జెసి ఆర్.గోపాలకృష్ణను కలిసి ఎస్‌సి, ఎస్‌టి చట్టం, ప్రస్తుత అమలులోని రిలీఫ్ చట్టాల ప్రకారం వివాహిత కుమార్తెలు ఉద్యోగాలు, పెన్షన్స్ పొందటానికి అర్హులేనని జీవో చూపించారు. గతంలో కలెక్టరేట్ అధికారులు చీరాల దేవరకొండ సుబ్బులు 2017లో జరిగిన హత్య కేసులో వారి కుమార్తెలకు ఇచ్చిన ఆర్డర్ కాపీలను జెసికి చూపించారు. ప్రస్తుత ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న మరలా విచారణ జరిపి రిపోర్ట్ పంపించారు. ఎట్టకేలకు దేవరకొండ రత్తమ్మ హత్య కేసులో రిలీఫ్ రూ.8.25 లక్షలు, చిన్న కుమార్తె పాలపర్తి దుర్గకు ప్రభుత్వ ఉద్యోగం, పెద్ద కుమార్తె పేరం నాగమణికి ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ మంత్లీ పెన్షన్ మంజూరైంది.

'గౌరవ వేతన' జీవులకు

సంక్షేమ పథకాలు అమలుచేయాలి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

గౌరవ వేతనంతో పనిచేసే స్కీం వర్కర్స్, మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని సిఐటియు ఆఫీసులో కాలం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో కె.ఉమామహేశ్వరావు మాట్లాడారు. టి.డి.పి కూటమి ప్రభుత్వం స్కీం వర్కర్స్, పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు ప్రభుత్వం నుండి వేతనం తీసుకుంటున్నారనే సాకుతో సంక్షేమ పథకాలు అమలుచేయక పోవడం దుర్మార్గమన్నారు. అతి తక్కువ వేతనాలు పొందుతున్న ఆశావర్కర్లకు సంక్షేమ పథకాల్లో కోత విధించడం సరికాదన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, జీవన వ్యయానికి అనుగుణంగా ఆదాయపరిమితిని పెంచకుండా గత 6 సంవత్సరాల క్రితం నిర్ణయించిన ఆదాయ పరిమితినే నేటికీ కొనసాగించడం సరికాదన్నారు. ఈ కారణంగా అంగన్వాడీలు, ఆశాలు, పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సంక్షేమ

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

పథకాలకు నోచుకోక తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. రెగ్యులర్ కాని స్కీం వర్కర్స్, పారిశుధ్య, ఇంజనీరింగ్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులందరికీ ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టి.డి.పి కూటమి ప్రభుత్వం కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మిక వర్గాన్ని దోచుకోవడానికి వీలు కల్పిస్తూ పని గంటలు పెంచడాన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. విశ్రాంతి సమయాన్ని పెంచడం, ఓవర్ టైమ్ పెంచడం, సరైన భద్రత కల్పించకుండానే రాత్రిపూట మహిళలతో పనిచేయించటానికి అనుమతించడం కార్మిక హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. కార్మికచట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్స్‌తో కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రప్రభుత్వం బాటలోనే టిడిపి కూటమి కొనసాగితే కార్మిక ఉద్యమ ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం.రమేష్ మాట్లాడుతూ స్కీం వర్కర్లకు కనీస వేతనాలు పెంచకుండా ఉన్న సంక్షేమ పథకాలకు అనర్హులను చేయడాన్ని సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని గౌరవవేతనంపై పనిచేసే స్కీం వర్కర్స్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులందరికీ ప్రభుత్వ ఉద్యోగి అనే హోదా తొలగించి సంక్షేమ పథకాలను అమలు చేయకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ జి.వి.కొండారెడ్డి, జి.శ్రీనివాసులు, చీకటి శ్రీనివాసరావు, పి.కల్పన, టి.రంగారావు, బి.సుబ్బారావు, టి.రాము, టి.మహేష్, పి.సి.కేశవరావు, టి.ఆవులయ్య, పి.ఆంజనేయులు, పారా శ్రీనివాసులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి
- పాకల సముద్రతీరంలో యోగాంధ్ర

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని మంత్రి డోలా బాల వీరాంజ నేయస్వామి పేర్కొన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంతో 11వ అంతర్జాతీయ యోగ దినోత్స వాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ఒక లక్ష ప్రదేశాల్లో యోగ కార్యక్ర మాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొ న్నారు. 'యోగాంధ్ర-2025' మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శింగరాయకొండ మండలం, పాకల బీచ్‌లో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమాన్ని మంత్రి స్వామి, కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా, ఎస్పీ ఏఆర్.దామోదర్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణలతో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు.కార్యక్రమాన్ని ప్రారం భించి.. యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ యోగా భారతీయ సంస్కృతిలో భాగమని, దీనిని మనందరం ఆచరించాలన్నారు. వన్ ఇయర్.. వన్ హెల్త్ పేరుతో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లాలో నాలుగు పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్దేశించగా ఇప్పటికే గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద, త్రిపురాంతకం దేవస్థానం వద్ద, కొత్తపట్నం బీచ్ వద్ద యోగా కార్యక్రమాన్ని జరుపుకోవడం జరిగిందని, ఈ రోజు పాకల బీచ్‌లో యోగా కార్యక్రమాన్ని జరుపుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటున్నారన్నారు. 21న రాష్ట్రంలోని లక్ష ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జూన్ 21న జరిగే

మాట్లాడుతున్న మంత్రి స్వామి

అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది ప్రజలు పాల్గొనేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీంతో పాటు 25 వేల మంది పిల్లలు 125 సూర్య నమస్కారాలు చేయబోతున్నారని మంత్రి వివరించారు.

కలెక్టర్ తమీమ్అన్సారియా మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పేర్కొన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నాటికి రాష్ట్ర ప్రజలందరికీ యోగా ప్రాముఖ్యతను తెలియజెప్పి, యోగాను వారి జీవనశైలిలో భాగస్వామ్యం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని, ఆ రోజున విశాఖపట్నం బీచ్ ఒడ్డున రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల మందితో యోగా నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో యోగాంధ్ర క్యాంపెయిన్ లో భాగస్వాములు అయ్యేందుకు ఇంతవరకు జిల్లాలో 9.60 లక్షల మంది యోగాంధ్ర యాప్‌లో నమోదయ్యారన్నారు. యోగాంధ్ర కార్యక్రమం కింద పర్యాటక ప్రాంతాల్లో నిర్వహిస్తున్న యోగా అభ్యసన కార్యక్రమాల్లో భాగంగా శింగరాయకొండ మండలంలోని పాకల బీచ్‌లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే పర్యాటక ప్రదేశాలు అయిన గుండ్లకమ్మ ప్రాజెక్టు, త్రిపురాంతకం దేవస్థానం, కొత్తపట్నం బీచ్‌లో యోగా కార్యక్రమాలను నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో యోగాను భాగంగా చేసుకుని ఆరోగ్యమైన జీవితాన్ని పొందాలన్నారు.

ఎస్పి ఏఆర్.దామోదర్ మాట్లాడుతూ యోగాను మన జీవితంలో భాగం చేయడంతో పాటు యోగా గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర క్యాంపెయిన్ జరుపుతున్నట్లు తెలిపారు. మంచి ఆరోగ్యాన్ని, మానసిక స్థైర్యాన్ని ఇచ్చే యోగాను ప్రతి ఒక్కరూ సాధన చేయాలన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు.

జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకాశం జిల్లాలో 6,758 ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20న స్వయం సహాయక సంఘాల సభ్యులతో పెద్దఎత్తున యోగా కార్యక్రమాన్ని జరుపుకోనున్నట్లు తెలిపారు.

పాకలలో యోగా గురువు పతంజలి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఈ యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ లక్ష్మీప్రసన్న, జిల్లా పరిషత్ సిఇఓ చిరంజీవి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆయుష్ ఆర్‌డిడి పద్మజాతి, పశుసంవర్ధకశాఖ డిడి రవి కుమార్, బిసి కార్పోరేషన్ ఇడి వెంకటేశ్వరరావు, మెప్మా పిడి శ్రీహరి, డిపిఓ వెంకటనాయుడు, డిఎస్డిఓ రాజరాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, యోగ సాధకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇసుక రిచ్ పరిశీలిస్తున్న అవనిగడ్డ డిఎస్పి శ్రీవిద్య

వివాదాస్పద రీచ్‌లోకి వెళ్లొద్దు..

ప్రజాశక్తి - వేమూరు

గ్రామాల సరిహద్దుల మధ్య నెలకొన్న వివాదాస్పద ఇచుకరీచ్‌లలో ఏ ఒక్కరూ అక్రమంగా ఇసుక తరలించరాదని అవనిగడ్డ డిఎస్పి శ్రీవిద్య హెచ్చరించారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం, చల్లపల్లి మండలం ఆముదంక గ్రామాల సరిహద్దు ప్రాంతాల్లో జూవ్వలపాలెం గ్రామస్తులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న వివాదంతో ఆదివారం అవనిగడ్డ, రేపల్లె డిఎస్పీల పరిధిలో ఎస్ఐలు, పోలీసులు ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. కొల్లూరు మండలానికి ఆనుకుని ఉన్న ఆముదాల లంక గ్రామ ప్రజలకు జువ్వలపాలెం ప్రజలకు అక్రమ ఇసుక తరలింపుపై గత కొన్ని రోజులుగా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో రేపల్లె డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు సమాచారం మేరకు అవనిగడ్డ డిఎస్పి శ్రీవిద్య తన పోలీసు సిబ్బందితో కలిసి ఘటన ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించారు. గ్రామస్తులను తగిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత మైనింగ్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. అక్కడ నెలకొన్న పరిస్థితిని బట్టి ఇసుక రీచ్‌లోకి ఏ ఒక్కరూ ప్రవేశించకుండా జెసిబితో రహదారికి అడ్డుగా గుంటలు తీసి రహదారిని నివారించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఈ ప్రాంతంలో ఎలాంటి ఇసుకరీచ్‌లకు అనుమతి లేదని, అలాంటిది కృష్ణా జిల్లా పరిధిలోని ఆముదాలంక గ్రామంలో అక్రమంగా ఇతర గ్రామాల ప్రజలు గాని, వాహనాలు గాని ప్రవేశించి ఇసుక తరలించరాదని అన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ ఇసుక తరలింపుతో ఆముదలంక గ్రామం మధ్య గుండా ట్రాక్టర్లు తిరిగితే రహదారులు దెబ్బతింటున్నాయని, వాహనాల తాకిడికి రహదారులపై నడవడానికి కూడా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆ గ్రామస్తులు పోలీసుల ఎదుట వాపోయారు. ఈ మేరకు ఆ ప్రాంతంలో తగిన పోలీసు బందోబస్తును నిర్వహించాలని బాపట్ల, కృష్ణా జిల్లాల పరిధిలోని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో భట్టిప్రోలు, కొల్లూరు ఎస్ఐలు ఎం శివయ్య, వివేకవర్ధన్, మోపిదేవి, చల్లపల్లి ఎస్ఐలు సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ పాల్గొన్నారు.

సురేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రభాకర్

వైసిపి నేతలకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - వేమూరు

వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ మేరుగ నాగార్జున, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌లకు అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆళ్ళమూడి ప్రభాకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ అంబేద్కర్ చారిటబుల్ ట్రస్టుకు వీరు నిత్యం అందుబాటులో ఉండి అవసరమైన సహకారం, కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ ఫారం నేషనల్ కోఆర్డినేటర్‌గా ఉన్న తనకు నాగార్జున అత్యంత సన్నిహితంగా ఉంటు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ ఉంటారని పేర్కొన్నారు. వీరిరువురు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

రాజకీయ కుంపట్లో రగులుతున్న కేబుల్ నెట్

- నెట్‌వైర్లు తొలగింపుతో నిలిచిపోయిన పౌర సేవలు
- కేబుల్ కనెక్షన్ లేకపోవడంతో మూగబోయిన టివిలు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో కేబుల్ నెట్ వ్యవహారం రాజకీయ కుంపట్లో రగులుతోంది. గత నాలుగు రోజులుగా నెట్ సేవలు అందుబాటులో లేవు. టివిలకు కేబుల్ కనెక్షన్ లేక బుల్లితెరలు మూగబోయాయి. ఎసిటీ, బిసిటి రెండు టివి నెట్వర్క్‌ల ద్వారా బాపట్ల ప్రజలు టివి కార్యక్రమాలు వీక్షిస్తుంటారు. ఎసిటి కేబుల్ నెట్‌వర్క్ ఎంతో కాలంగా ఉంది. కొత్తగా వచ్చిన బీసీటీ పట్టణం మొత్తం ఆక్రమించేసేయాలని రాజకీయంగా పావులు కదుపుతుంది. పట్టణంలో నెట్ కనెక్షన్లు, టివి కనెక్షన్ వైర్లు పూర్తిగా తొలగించేశారు. బాపట్ల కేబుల్ వివాదాలు ఆర్డిఓ పంచాయతీ వరకు వెళ్లాయి. బిసిటి, ఎసిటీ కేబుల్ నిర్వాహకులను ఆర్డిఓ పిలిపించి చర్చించారు. ఏం మాట్లాడారనే అంశం దేవ రహస్యంగా ఉంది. పట్టణంలో చూస్తే కేబుల్ కనెక్షన్లు, నెట్ కనెక్షన్ వైర్లన్ని పూర్తిగా తొలగించేసి కుప్పలు, కుప్పలుగా పడేశారు. పాఠశాలలు తెరవడంతో విద్యార్థులకు ఇచ్చే బస్సు పాస్‌లకు సైతం నెట్ కనెక్షన్ లేకపోవడంతో ఆర్టీసీలో కంప్యూటర్ సెంటర్ మూసేశారు. కేబుల్ కనెక్షన్లు అధిపత్య పోరుతో విద్యార్థులను సైతం ఇబ్బందులకు గురిచేస్తుంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన పాలకులే రూ.లక్షల్లో జరుగుతున్న కేబుల్ వ్యాపారంపై కన్నేసి ఆధిపత్యం కొనసాగించేందుకు ఆరాటపడుతున్నారు. అసలు కేబుల్ తోపాటు నెట్ కనెక్షన్ల వైర్లు కూడా తొలగించేసారని ఆరోపణలు వినిపిన్నాయి. దీంతో ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయాల్లో నెట్ ద్వారా అందాల్సిన పౌర సేవలు నిలిచిపోయాయి. పాఠశాల విద్యార్థులకు ఆర్టీసీ అందించే బస్సు పాసులు సైతం అందించే పరిస్థితి లేకుండా పోయింది. రెన్యువల్ చేసిన జర్నలిస్టుల బస్సు పాసులు సైతం జిల్లా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విలేకరులు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. దీనికి అధికారులు మాత్రం ఎఁ కుంటి సాకులు చెబుతున్నారు. విద్యుత్ స్తంభాలకు వైర్లు కట్టారు. అందువల్లే వీటిని తొలగించాల్సి వస్తుందని చెప్పుకొస్తున్నారు. వాస్తవ పరిస్థితులు చూస్తే కేబుల్ వ్యాపారంలో ఏక ఛత్రాధిపత్యం కోసం చేస్తున్న పాపాలకు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కేబుల్ వైర్లు కట్ చేయడంతో సాంకేతిక వ్యవస్థ దెబ్బ తిని బాపట్లలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొని ఉంది. టివిలు మూగబోయాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో నెట్ లేక కంప్యూటర్లు పనిచేయడం లేదు. ఇంటర్నెట్, కేబుల్ నెట్వర్క్ నిలిచి పోవడంతో టివిలు చూసే బుల్లితెర మహిళా వీక్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్లుగా లేని కేబుల్ నెట్ సమస్య ఇప్పుడే ఎదురైందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కట్ చేసి పడేసిన కేబుల్ వైర్లు

విద్యుత్ స్తంభాలకు వైర్లు కట్టడం వల్లే తొలగింపు

కేబుల్, నెట్ కనెక్షన్ల వైర్లతో పట్టణంలో విద్యుత్ స్తంభాలకు అమర్చిన లైటింగుకు ఆటంకం కలగడం వల్లే కేబులు, నెట్ వైర్లు తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలో ప్రధాన ప్రాంతాలైన రథం బజార్, ఎజి కాలేజీ రోడ్డు ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో వైర్లం కట్ చేశారు. దీంతో నెట్ సేవలకు పూర్తిస్థాయిలో అంతరాయం కలిగింది. నెట్ సర్వీసు, కేబుల్ కనెక్షన్ వైర్లు ఇష్టానుసారంగా విద్యుత్ స్తంభాల చుట్టి తగిలించి ఉంచడం వల్ల లైట్లకు ఇబ్బంది కలుగుతుందని, అందుకే కేబుల్, నెట్ వైర్లుకట్ చేసినట్లు తెలిపారు. బిఎస్ఎన్ఎల్ వైర్లు సక్రమంగా ఏర్పాటు చేసుకోవడంతో వాటి జోలికి వెళ్లలేదని అన్నారు.

చప్టా సమీపంలో ప్రారంభమైన వంతెన పనులు

వెల్లటూరు ఛానల్‌కు సైడ్ వాళ్ల నిర్మాణం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా వెల్లటూరు నుండి ప్రారంభమైన కాలువలో నీటి సంఘాల ఆధ్వర్యంలో కూడికతీత పనులు ప్రారంభించారు. గతేడాది కూలిపోయిన అక్విడెక్ట్ స్థానంలో నూతన నిర్మాణానికి అధికారులు చేపట్టిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈపాటికే వెల్లటూరు ఛానల్‌పై చప్టా నిర్మాణానికి స్లాబు పూర్తి చేసుకోగా దాని పక్కన రైతులు రాకపోకలకు అవసరమైన వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. దీనికి అనుసంధానంగా బలహీనంగా ఉన్న ఛానల్ కాలువ కట్టను బలపరిచి దానికి అనుగుణంగా కాలువలో కాంక్రీట్ గోడను ఎపిఎస్ తూము వరకు కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది ఇదే వెల్లటూరు ఛానల్‌పై రైల్వే ట్రాక్ సమీపంలో రైతుల రాకపోకలకు అనుగుణంగా మరో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాలువలో వంతెన నిర్మాణాలు, పూడికతీత పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అక్విడెక్టు నిర్మాణ ప్రాంతంలో మరో నెలల్లోగా నిర్మాణ పనులు పూర్తిచేసి రైతులకు సాగునీటి కొరకు, రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని భావిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు, గుత్తేదారులు చెబుతున్నారు. దీనికిగాను ఎన్ని అవాంతరాలు ఎదురైనా రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. వాతావరణం అనుకూలిస్తే అనుకున్న సమయాన్ని కంటే ముందుగానే పనులు పూర్తి చేయలని భావిస్తున్నట్లు చెప్పారు.

మిగిలిన కాలువల్లో కూడా కూడికతీత చేపట్టాలి

వెల్లటూరు ఛానల్‌లో జరుగుతున్న పూడికతీత పనుల తో పాటు మిగిలిన సాగునీటి కాలువలు, మురుగు పారు దల కాలువలు కూడా పూడికతీత చేపట్టాలని ఆయా ప్రాం తాల రైతులు కోరుతున్నారు. ఈపాటికే ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసిన దృష్ట్యా వారి ద్వారా కాలువల మరమ్మత్తులు, పూడికతీత, అభివృద్ధి పనులు చేపట్టి గతేడాది రైతులకు ఎదురైన నష్టాలు తొల గించేందుకు అధికారులు, నీటి సంఘాలు ప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరారు. గతేడాది పారుదల సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో నెలలు తరబడి పంట పొలాల్లో నిలిచిపోయిన వర్షపు మీరు బయటకు వెళ్లే మార్గం లేక పంటలు పూర్తిగా దెబ్బతిని తీవ్ర నష్టపోయామని, అలాంటి సంఘటన పునరావతం కాకుండా ముందుగానే చర్యలు తీసుకుని అభివృద్ధి పరచాలని రైతులు కోరుతున్నారు.

చప్ట సమీపంలో వంతెన నర్మాణ పనులు

వెల్లటూరు చానల్లో జెసిబితో పూడిక తీస్తున్న దృశ్యం

పంట మార్పిడి పద్ధతితో నాణ్యమైన దిగుబడులు

ప్రజాశక్తి - అద్దంకి

రైతులు పంట సాగు సమయంలో ఆధునీకరణ, వ్యవసాయ పరికరాలు, తక్కువ పెట్టుబడుతో ఎక్కువ పంట దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ శాస్త్రవే త్తలు ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు సలహాలు అంది స్తున్నారు. ప్రతి రైతు వ్యవసాయ అధికారులు సూచనలు పాటించి మరింత దిగుబడి సాధించే విధంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వేగంగా మారుతున్న వ్యవసాయ, సామాజిక పరిస్థితుల వల్ల గ్రామీణ ప్రాంత రైతులు ఉపాధి కోసం ఎక్కువగా పట్టణాలు, నగరాలకు వలసపోతున్నారు. దీని వల్ల గ్రామాల్లో రైతుల సంఖ్య తగ్గిపోయి, వ్యవసాయాన్ని సులభంగా చేయడం కోసం ఏడాది పొడవునా ఒకే రకమైన పంట సాగుచేస్తున్నారు. దీని వల్ల నేలలో ఒకే లోతులో ఉన్న పోషకాలు మాత్రమే పంట తీసుకోవడం వల్ల ఆలోతు వరకు నేల భూసారాన్ని కోల్పోతుంది. ఒకే పంట మళ్లీ మళ్లీ వేయడం వల్ల పంటను ఆశించే పురుగులు, తెగుళ్ల అధికంగా వృద్ధిచెంది పంటకు చీడపీడల బెడద పెరగడంతో పాటు ఉత్పత్తి ఆశించినమేర రాని పరిస్థితి నెలకొంది. నేల కోతకుగురవడంతో పాటు భూసారం తగ్గిపోతోంది. ఈ సమస్యను అధిగమించడానికి పంటమార్పిడి చేయడం మంచిదని వ్యవసాయాధి కారులు సూచిస్తున్నారు. పంట మార్పిడి అంటే ఒకే పొలంలో ఒకే ఏడాది వేర్వేరు పంటలు పండించడం. రెండు లేదా అంతకంటే ఎక్కువ పంటలు మార్చి పండించడం. పంట మార్పిడికి ఎంచుకునే పంటల వేర్లు భూమిలో వివిధ లోతుల్లోనికి వెళ్లేవిగా ఉండాలి. పంట కాలంలో తేడా ఉండే విధంగా ఒకే జాతికి చెందిన పంటలు కాకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. దీని వల్ల నేలలో వివిధ లోతుల్లో నుంచి మొక్కలు పోషకాలను అధికంగా తీసుకునే వీలు ఉంటుంది. ఒక పంటను ఆశించే చీడపీడలు మరో పంటను ఆశించవు కాబట్టి చీడపీడల బెడద తగ్గుతుంది. దీని వల్ల రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గి సాగు ఖర్చు తగ్గుతుంది. కలుపు మొక్కల సమస్య పంట మార్పిడితో తగ్గించవచ్చు. నేల వాతావరణం నుంచి కర్బనాన్ని గ్రహించి నిల్వ చేసుకోవడం పంటకు నీరు అందడం వల్ల దిగుబడి పెరుగుతుంది.

నాణ్యత పేరుతో పొగాకు చెక్కులు సగం తిరస్కరణ

అనంతరం జిపిఐ కంపెనీకి చెక్కులు తెచ్చిన హనుమంతరావు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరం జిపిఐ కంపెనీ గోడౌను వద్దకు ట్రాక్టర్‌పై బొబ్బేపల్లి గ్రామానికి చెందిన దండ హనుమంతరావు పొగాకు చెక్కులు తరలించారు. అక్కడ నాణ్యత పేరుతో సగం చెక్కులు తిరస్కరించడంతో తిరిగి ఇంటికి తీసుకెళుతున్న సమయంలో ఆయన 'ప్రజాశక్తి'తో తన ఆవేదన పంచుకున్నారు. తాను ఐదెకరాలు నల్లబర్లి పొగాకు సాగు చేశానని, అందులో రెండెకరాలు సొంతం, మూడెకరాలు కౌలుకు భూమి తీసుకుని సాగు చేసినట్లు తెలిపారు. ఎకరాకు కౌలు రూ20వేలు చెల్లించినట్లు తెలిపారు. ఎకరాకు సొగాకు సాగుకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. అయితే నల్లబర్లీ పొగాకు ప్రస్తుతం కొనకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఇతరుల వద్ద తెచ్చిన అప్పులు అలాగే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను జిపిఐ కంపెనీ గొడౌను వద్దకు పది చెక్కులు తెస్తే వాటిలో నాలుగు చెక్కులు తిరస్కరించారని, మిగిలిన ఆరు చెక్కుల్లో రెంటికి ఒక్కొక్కటి రూ.9వేల చొప్పు, రెండు ఒక్కక్కటి రూ.8వేల, చొప్పున మిగిలిన రెండు ఒక్కొక్కటి రూ.6వేల చొప్పున మొత్తం రూ.40వేలకు మాత్రమే కొనుగోలు చేసినట్లు చెప్పాడు. మిగిలినవి ఎలా అమ్ముకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వాలు రైతుల పట్ల శ్రద్ధ చూపడం లేదని, తగిన న్యాయం చేయడం లేదని ఆవేదనంగా వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు స్థానిక పెద్దలు చెప్పిన విధంగా ఒక్కొక్క చెక్కు రూ.12,500 చొప్పున కొంటె తప్ప తనకు న్యాయం జరగదని అన్నారు. ప్రభుత్య అధికారులు స్పందించి మద్దతు ధరకు కొనని తమకు న్యాయం చేయాలని కోరారు.

నిబంధనలు సడలించాలి

ప్రభుత్వం నిబంధనలు సడలించి రైతులకు న్యాయం చేసే విధంగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించాలని సిపిఎం మార్టూరు ప్రాంతీయ నాయకులు రాంబాబు కోరారు. రైతుల దగ్గర ఉన్న నల్లబెర్లి పొగాకు మొత్తం కొనకపోతే రైతుల ఆర్థిక పరిస్థితి దిగజారి వచ్చే సంవత్సరం పంటలు సాగులు చేయాలేని పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. దీనివల్ల వ్యవసాయ రంగం దెబ్బ తినే అవకాశం ఉందని అన్నారు. మంత్రులు హామీ ఇచ్చిన ప్రకారం న్యాయమైన ధరకు అన్ని రకాల పొగాకు పంట కొనాలని కోరారు. మద్దతు ధరకు కొనుగోలు చేయకపోతే రైతులు వ్యవసాయం చేయడానికి ముందుకు రాలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి రైతులు నష్ట పోకుండా తగిన మద్దత్తు ధరకు కొని రైతులను ఆదుకోవాలని ప్రభుత్యాన్ని డిమాండ్ చేశారు.

ఎంఎల్‌ఎ కొండయ్య సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని వాడరేవు మాజీ సర్పంచి ఎరిపిల్లి రమణ తన అనుచరులతో శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య సమక్షంలో తెలుగుదేశంలో ఆదివారం చేరారు. తెలుగుదేశం కండువాలు మెడలో కప్పి ఎంఎల్‌ఎ సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ కొండయ్య మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. సంక్షేమంతోపాటు అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిపెట్టి పనిచేస్తున్నారని చెప్పారు. వాడరేవు సముద్ర తీరం సుందరంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

టిడిపిలో చేరిన వాడరేవు మాజీ సర్పంచి రమణ, ఉపసర్పంచి పెర్ల రాజారావు

అభివృద్ధితోపాటు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందజేస్తున్నట్లు చెప్పారు. ఎంతమంది పిల్లలు బడికి వెళుతుంటూ అంత మందికీ తల్లికి వందనం పథకం ద్వారా మహిళల కాతాల్లో ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున నగదు జమ చేసినట్లు చెప్పారు. 1వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు జులై 5న జమ చేస్తారని తెలిపారు. అర్హులు ఎవరికైనా రాకుంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. రాజకీయాలు అతీతంగా గ్రామ అభివృద్ధికి కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ప్రెసిడెంట్ పేర్ల రాజారావు, ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, వాడరేవు తెలుగుదేశం నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఐలవరం వివేకవర్ధని గ్రంథాలయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్వాతంత్ర ఉద్యమ కాలంలో గ్రామస్తులకు ఆనాటి పరిస్థితులు, స్థితిగతులను తెలియజేసేందుకు, సమాజంలో జరిగే సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య చేసేందుకు కూటమిగా ఏర్పాటు చేసుకున్న భవనం నేడు శిథిలావస్థకు చేరింది. మండలంలోని ఐలవరం రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతంగా ఉంటుంది. అలాంటి గ్రామంలో స్వాతంత్ర ఉద్యమ కాలంలో కందుకూరి వీరేశలింగం పంతులు పేరుతో ఆనాటి నాయకులు ఒక కమిటీగా ఏర్పడి దేశంలో జరుగుతున్న సంఘటనలు, అంశాలు గ్రామస్తులకు తెలియజేసేందుకు వివేకవర్ధని పేరుతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ గ్రంథాలయం ద్వారా ఆనాడు సమాజంలో అనేక అంశాలను మాస, వార పత్రికల ద్వారా ప్రజలకు విజ్ఞానం కలిగే విధంగా దోహదపడింది. కాలక్రమేణా వార పత్రికలతో పాటు దినపత్రికలు, ఆకాశవాణి రేడియో విధానం అందుబాటులోకి రావడంతో ఈ గ్రంథాలయ భవనాన్ని రేడియో కేంద్రంగా కూడా వినియోగించారు. సాంకేతిక వ్యవస్థ లేని సమయంలో ప్రజలు ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఈ రేడియో కేంద్రం నుండి ఏర్పాటు చేసిన మైకు ద్వారా దేశంలో, ప్రపంచంలో జరిగే సంఘటనల వార్తలు వింటూ ఉండేవారు. కొన్ని రోజుల తర్వాత గ్రామానికి పంచాయతీ వ్యవస్థ ఏర్పడటంతో పంచాయతీ నిర్వహణకు ఎక్కడ భవనాలు లేకపోవడంతో ఈ గ్రంథాలయ భవనాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంగా కొంతకాలం కొనసాగించారు. అనంతరం పంచాయతీ భవనానికి గ్రామస్తులు స్థలాన్ని దానం చేయడంతో దానిలో ప్రభుత్వ భవనం ఏర్పడింది. దీంతో ఈ గ్రంథాలయ భవనాన్ని దిన, మాస పత్రికలు, వివిధ విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు ఏర్పాటు చేసి

ఐలవరం వివేకవర్ధని గ్రంథాలయం

గ్రంథాలయం ద్వారా ప్రజలు, విద్యార్థులకు అందిస్తూ ఉండేవారు. ఈ విధానాన్ని అమలు పర్చేందుకు తక్కువ వేతనంతో ఒక లైబ్రేరియన్ కూడా భట్టిప్రోలు, మాటూరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కొంతకాలం నిర్వహించారు. ఆ సమయంలో ఈ గ్రంథాలయం నిత్యం ఉదయం, సాయంత్రం విద్యార్థులు, ప్రజలకు సమయపాలన పాటిస్తూ పుస్తకాలు అందజేసి వాటిని తిరిగి సేకరించుకుంటూ ఉండేవారు. అదే సమయంలో ఈ గ్రంథాలయంలో ప్రభుత్వం నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ఏర్పాటు చేసిన నిరంతర విద్యా కేంద్రం కూడా నిర్వహించారు.

నిర్లక్ష్యంతో దెబ్బతిన్న గ్రంథాలయం

పంచాయతీకి నూతన భవనం నిర్మించుకున్న అనంతరం పంచాయతీకి అవసరమైన బ్లీచింగ్, సున్నం, కార్యాలయంలో పాత రికార్డులు భద్రపర్చుకోవడానికి ఈ గ్రంథాలయ భవనాన్ని వినియోగించుకున్నారు. ఆ సమయంలో బ్లీచింగ్, సున్నం గ్రంథాలయం లోపల వేయటం, దానిని శుభ్రపర్చకపోవటంతో ప్రజలు దీనిని వినియోగించుకోవడానికి వీలు లేకుండా పోయింది. అదే సమయంలో గ్రామనికి చెందిన కొందరు దాతలు వరండాలో బల్లలు ఏర్పాటు చేసి గ్రంథలయంను పట్టణానికి అనుకూలంగా రూపుదిద్దారు. ఒక దశలో టెలివిజన్ అందుబాటులోకి వచ్చిన సమయంలో వరండాలోనే ప్రజలు టివి ద్వారా సమాచారాన్ని తెలుసుకునేందుకు ఒక టివి అరమరను కూడా ఏర్పాటు చేసి కొంతకాలం టివిని కొనసాగించారు. తుదకు దీనిలో పనిచేసే లైబ్రేరియన్‌కు కూడా వేతనాలు ఇవ్వకుండా తొలగించడంతో అప్పటి నుండి గ్రంథాలయం ఆలనా పాలన చూసేవారు లేరు. లోపలికి ప్రవేశించడానికి పంచాయతీ నిర్లక్ష్యం కారణంగా దుమ్ము, దూళి పేరుకుపోవడంతో వాడకం లేక పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం ఈ గ్రంథాలయంలో పంచాయతీ ద్వారా పలు రకాల దినపత్రికలు మాత్రం వస్తూ ఉంటాయి. వాటిని చదవడానికి గ్రంథాలయంలో పరిశుభ్రత లేకపోవడం, అనుకూలంగా లేకపోవడంతో పాఠకులు దినపత్రికలను ప్రక్కనున్న దుకాణాలు అరుగులపై కూర్చుని చదువుకొని వాటిని ఒక్కడే వదిలేసి వెళుతూ ఉంటారు. గ్రంథలయ పర్యవేక్షణ పూర్తిగా తగ్గిపోవడంతో విద్యార్థులు, గ్రామస్తులకు తీవ్ర సమస్యగా మారింది. దీంతో నిరుపయోగంగా ఉండి, శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనాన్ని పూర్తిగా తొలగించి ఈ ప్రాంతంలో ఎవరో ఒకరు వారికి అనుకూలమైన రీతిలో విగ్రహాలు, ఇతర కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రంథాలయ చరిత్రను దృష్టిలో ఉంచుకొని సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి శిథిల భవనం స్థానంలో గ్రామస్తులకు ఉపయోగపడే విధంగా నూతన గ్రంథాలయంతో పాటు ప్రజా ప్రయోజనాల కోసం అవసరమైన రీతిలో తీర్చిదిద్ది, అన్యాక్రాంతం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మెడికల్ కిట్టు అందజేస్తున్న మాజీ ఉపసర్పంచ్ పోలకం శేఖర్

మెడికల్ కిట్టు బహూకరణ

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్లపల్లిలో పమిడాల సుబ్బారావు అలియాస్ షారుఖ్ ఖాన్ చేస్తున్న ఉచిత వైద్య సేవలకు మెచ్చి మెడికల్ కిట్టు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ పోలకం శేఖర్ మాట్లాడుతూ తన పెదనాన్న, పెద్దమ్మ అలపర్తి శ్రీరాములు, చంద్రకాంతమ్మ జ్ఞాపకార్థం రూ.10వేల విలువైన మెడికల్ కిట్టు అందజేసినట్లు చెప్పారు. ఇతర ప్రాంతాలతోపాటు తమ గ్రామస్తులు వచ్చి షుగర్, యాక్సిడెంట్ కేసులు, ఇతర గాయాలకు సంబంధించి ఉచితంగా వైద్యం పొందుతున్నారని పేర్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరికీ ఉచితంగా సేవలు కొనసాగించాలని కోరారు. అవసరమైతే మరో సహాయకున్ని అందుబాటులో ఉంచుకోవడానికి అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యారాసు బసవేశ్వరరావు, అద్దంకి శ్రీనివాసరావు, మెట్టు వాసు, చెరుకూరి శ్రీనివాసరావు, శివ, బి శ్రీనివాసరావు, ఎం రమణ, పి రాజు, బి సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ప్రతిభ కల్గిన విద్యార్థినికి వాకర్స్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాల మైదానంలో వాకింగ్ సభ్యులు ఇమ్మిడిశెట్టి రాధాకృష్ణమూర్తి కుమార్తె జయశ్రీ 10వ తరగతిలో 583 మార్కులు సాధించిన సందర్భంగా శాలువాతో ఆదివారం సత్కరించారు. ఉన్నత చదువులు చదువుకునేందుకు రూ.37,500 నగదు, నోట్ బుక్స్ వాకింగ్ సభ్యుల సహకారంతో అందజేశారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీకృష్ణ గోశాల్లోని గోవుల పోషణ నిమిత్తం రూ.1500 నగదు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేసన్ ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, నారాయణమూర్తి, వలివేటి మురళీకృష్ణ, బాల గంగాధరరావు, సుబ్బారావు, గుర్రం బధిరినాథ్, చింతా రమేష్, గెల్లి అమర్ చంద్, వీరాంజనేయులు, తిరుపతిరావు, పూర్ణా, కాటమరాజు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడిక తొలగించాలి

ప్రజాశక్తి - చీరాల

కొమ్మూరు కాలువ నుండి బోయినవారిపాలెం, స్టువర్టుపురం కెనాల్ వరకు పంట కాలువను వైసిపి రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కావూరి రమణారెడ్డి ఆదివారం పరిశీలించారు. కాలువలో గుర్రపుడెక్క, జమ్ము పెరిగి పూడికలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. రానున్న వర్షాలకు నీళ్లు వెళ్లే మార్గం లేక పంట పొలాలు మునిగిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తోటవారి పాలెం ఎత్తిపోతల పథకం, బోయినవారిపాలెం ఆరికట్టు, స్టువాటుపురం కెనాల్ ఈపురుపాలెం పరిధి వరకు 20వేల ఎకరాలు ఆయకట్టు ఉన్నట్లు తెలిపారు. అధికారులు ఈ పూడికలు తొలగించి రైతులకు సాగునీరిందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి ఉపాధ్యక్షులు సప్పిడి రామచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు షేక్ సైదా

24న షర్మిలారెడ్డి పర్యటన

డిసిసి అధ్యక్షులు షేక్ సైదా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఈ నెల 24న జిల్లా పర్యటనను జయప్రదం చేయలని డిసిసి అధ్యక్షులు షేక్ సైదా, జిల్లా ఇన్‌చార్జి సత్యేంద్రబాబు కోరారు. స్థానిక డిసిసి కార్యాలయంలో ఆదివారం జరిగిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఈ నెల 9 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో పర్యటిస్తున్నారని, ఇందులో భాగంగా ఈ నెల 24న ఒంగోలు రానున్న సందర్భంగా పెద్దఎత్తున ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. షర్మిలారెడ్డి ఈ నెల 24న నెల్లూరు జిల్లా నుండి మధ్యాహ్నం రెండు గంటలకు ఒంగోలు చేరుకొని అంబేద్కర్ భవన్‌లో జరిగే జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తతస్థాయి సమావేశంలో పాల్గొంటారని వారు తెలిపారు. షర్మిలారెడ్డితో పాటు ఈ సమావేశంలో రాష్ట్ర అనుబంధ సంఘాల నాయకులు ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు. సమావేశంలో జిల్లాలో నెలకొన్న వివిధ సమస్యలపై చర్చించి, తీర్మానించి భవిష్యత్తు ఉద్యమాలను రూపకల్పన చేస్తారన్నారు. జిల్లాలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై దిశా నిర్దేశం చేస్తారని, అనేకమంది వివిధ పార్టీల నుండి వైఎస్ షర్మిలారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు కార్యక్రమంలో నగర నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు టి. నాగలక్ష్మి, దర్శి నియోజకవర్గ సమన్వయకర్త కైపు వెంకటకష్ణారెడ్డి, నాయకులు బిఆర్ గౌస్, దేవరపల్లి సుబ్బారెడ్డి, ఉద్దండి మల్లికార్జున్ రావు, మన్నం ప్రసన్నరాజు, సుదర్శి రవి, సుధీర్ వర్మ, ఉంగరాల శ్రీనివాసరావు, షేక్ రసుల్, గోరంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నీట్‌లో మెరిసిన 'శ్రీవశిష్ఠ' విద్యార్థులు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

నీట్-2025 పరీక్షా ఫలితాలలో ఒంగోలు శ్రీ వశిష్ఠ వెలాసిటీ ఐఐటి నీట్ అకాడమీ విద్యార్థులు మెరిశారు. ఇంద్ర నందిని 542/720 తో పాటుగా 11 మంది నీట్ లో సీట్లు సాధించారు. అదేవిధంగా ఐఐటి అడ్వాన్స్ మొదటి రౌండ్ కౌన్సెలింగ్ లో విద్యార్థిని కె.అక్షయ ఐఐటి ఖరగ్ పూర్ లో సీటు సాధించింది. ఈ సందర్భంగా శ్రీవశిష్ఠ వెలాసిటి ఐఐటీ నీట్ అకాడమీ డైరెక్టర్ నిమ్మల శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల నిరంతర కృషి, అధ్యాపకుల సరైన మార్గనిర్దేశం, పరీక్షల నిర్వహణతోనే నీట్‌లో సీట్లు సాధించగలిగామన్నారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన విద్యార్థులకు, ఈ విజయానికి కారణమైన అధ్యాపకులు, ప్రిన్సిపల్ యాసిన్ ను అభినందించారు. కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్లు కృష్ణ ప్రియ, అకాడమిక్ డీన్ ఆరికట్ల సత్య, ప్రిన్సిపల్ యాసిన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రచయిత, గాయకుడు గజ్జలకొండ బాలు రచించి, గానం చేసిన 'భక్తిరస సంకీర్తనలు' ఆడియో సిడి ఆవిష్కరణ సభ స్థానిక కర్నూల్ రోడ్డులోని గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానంలో ఆదివారం జరిగింది. దేవస్థానం శాశ్వత ధర్మకర్త పెలప్రోలు రామకష్ణ పరమహంస సిడిని ఆవిష్కరించారు. ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ కవి పొన్నూరు వెంకట శ్రీనివాసులు సభకు అధ్యక్షత వహించారు.

సరదా కోసం వచ్చి..

ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదు..

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి
- పాకల బీచ్ వద్ద బేవాచ్ టవర్ ప్రారంభం

ప్రజాశక్తి-శింగరాయకొండ

సరదా కోసం వచ్చి ప్రాణాలు కోల్పోకూడదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయ, వయోవద్ధుల శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. మండలంలోని పాకల బీచ్ వద్ద ఇటీవల జరిగిన ప్రమాదాలను దష్టిలో ఉంచుకొని, పర్యాటకుల ప్రాణభద్రతకు బీచ్ వద్ద 15 లక్షల రూపాయలతో నిర్మించిన బే వాచ్ టవర్‌ను ఆదివారం నాడు మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్అన్సారియా, ఎస్పీ ఏ.ఆర్.దామోదర్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ ప్రారంభించారు. వాచ్ టవర్ ద్వారా సముద్రతీరంలో భద్రతా అంశాలను పర్యవేక్షించటం, నీటి ప్రవాహ ఉదతిని గుర్తించటం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన వంటి చర్యలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పర్యాటకుడూ సురక్షితంగా ఇంటికి తిరిగి వెళ్లే విధంగా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. పర్యాటకులను అప్రమత్తం చేయటానికి బేవాచ్ టవర్ ఉపయోగపడుతోందన్నారు. శింగరాయకొండ, పాకల బీచ్ ప్రాంతాల్లో గతంలో కొన్ని దుర్ఘటనలు జరిగాయని, వాటిని పునరావతం కాకుండా నిరోధించేందుకు వాచ్ టవర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

బేవాచ్ టవర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పాకల బీచ్ ప్రస్తుతం జిల్లాలో ఒక ప్రముఖ పర్యాటక ప్రాంతమని, ఇలాంటి ప్రదేశాల్లో అభివద్ధి కార్యక్రమాలు చేపట్టడమే కాక, పర్యాటకుల భద్రతా పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం అవసరమన్నారు. ఈ వాచ్ టవర్ ద్వారా సముద్రపు ప్రవాహాలు, కెరటాల ఉధతి వంటి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందుతుందన్నారు. ప్రమాదాలను ముందే గుర్తించి, రక్షణ చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందన్నారు.

ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ పర్యాటకులు ఎక్కువగా వచ్చే పాకల బీచ్ వంటి ప్రదేశాల్లో గతంలో కొన్ని విషాదకరమైన ఘటనలు చోటుచేసుకోవడంతో పలు భద్రతా చర్యలు తీసుకోవటం జరిగిందని, బీచ్ పరిసర ప్రాంతాల్లో పికెటింగ్, పెట్రోలింగ్ జరుగుతోందని, వాచ్ టవర్ ద్వారా సముద్రపు పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుని, పోలీసులు తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. తీర ప్రాంతాల్లో భద్రతకు పోలీస్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, ఎమర్జెన్సీ స్పందన యంత్రాంగాన్ని మరింతగా మెరుగుపరుస్తామన్నారు. పర్యాటకులు భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలను పెద్దల పర్యవేక్షణలో ఉండేలా చూడాలన్నారు.

బేవాచ్ టవర్ నిర్మాణంలో మరియు అత్యాధునికమైన టెక్నాలజీ సీసీ కెమెరాలు, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం మరియు టైం క్లాక్ అనౌన్స్ సిస్టమును ఏర్పాటు చేసినందుకు శింగరాయకొండ సిఐ సిహెచ్ హజరత్తయ్య, మరియు ఎస్ఐ మహేంద్రను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ, ఆర్‌డిఓ లక్ష్మీప్రసన్న, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, శింగరాయకొండ సిఐ సిహెచ్.హజరత్తయ్య, కోస్టల్ సెక్యూరిటీ సిఐ శివన్నారాయణ, ఆర్‌ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, శింగరాయకొండ ఎస్ఐ మహేంద్ర, టంగుటూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలు

- పశుపోషకుల ఇంటి ముంగిటకే సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు
- 'ఉపాధి'లో గోకులం షెడ్ల నిర్మాణం
- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వేణుగోపాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో పశుపోషకులకు అండగా ఉంటూ మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా జిల్లా పశుసంవర్ధక శాఖ పనిచేస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి బి.వేణుగోపాల్ వివరించారు. పశుపోషకుల ఇంటి ముంగిటకే పశువైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం పలు సంక్షేమ పథకాల అమలుతో పాటు, సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. జిల్లాలో పశు సంవర్ధకశాఖ పరిధిలో 10 ఏరియా వెటర్నరీ వైద్యశాలలు, 65 వెటర్నరీ డిస్పెన్సరీలు, 59 గ్రామీణ పశు వైద్య కేంద్రాలు, మూడు నియోజకవర్గ స్థాయి వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, 199 రైతు సేవాకేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. జిల్లాలో 10 మంది సహాయ సంచాలకులు, 50 మంది పశువైద్యాధికారులు, 59 మంది పశు సహాయక సిబ్బంది, 193 మంది యానిమల్ హస్బెండ్రీ అసిస్టెంట్‌లు, 81 మంది గోపాలమిత్రులు, ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారని తెలిపారు.

రైతు సేవాకేంద్రాల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 4,750 మంది రైతులకు రూ 65.50 లక్షల విలువ గల 120 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాలు 75 శాతం రాయితీపై సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 250 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాలు 75 శాతం రాయితీపై సరఫరా చేయడం లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,17,408 విలువ గల 16 గడ్డి కత్తిరించు యంత్రాలను 40 శాతం రాయితీతో సరఫరా చేశామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మండలానికి రెండు చొప్పున గడ్డి కత్తిరించే యంత్రాలను సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

ముఖాముఖి

గోకులాల నిర్మాణం

జిల్లాలో ఉపాధి హామీ నిధులతో పశుపోషకుల కోసం పశువులు, గొర్రెలు, మేకల, కోళ్లపాకల షెడ్ల నిర్మాణాలకు గోకులం పథకం కింద ఆర్థిక చేయూత ఇవ్వడం జరుగుతుందన్నారు. పశువుల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకల, కోళ్ల షెడ్లకు 70 శాతం రాయితీ ఇస్తారన్నారు. మిగిలినది రైతు వాటా లేదా వేజ్ కాంపోనెంట్ కింద జమచేస్తారని తెలిపారు. జిల్లాలో మొదటి విడతగా కోస్తా మండలాలకు 300, మెరక మండలాలకు 475 మొత్తం 775 గోకులం షెడ్లు ఇచ్చారన్నారు. ఒక్కొక్క కోస్తా మండలానికి 50, మెరక మండలానికి 25 చొప్పున ఇవ్వటం జరిగిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వెయ్యి గోకులం షెడ్లు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు.

పశుగ్రాస క్షేత్రాలు

జిల్లాలో పశుసంవర్ధక శాఖ, ఉపాధి హామీ కింద ఈ ఆర్థిక సంవత్సరంలో మండలానికి 40 ఎకరాల చొప్పున మొత్తం వెయ్యి ఎకరాల పశుగ్రాస క్షేత్రాలను లక్ష్యంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకోసం పశువులు కలిగి స్వంతభూమి ఉన్న చిన్న, సన్నకార రైతులు అర్హులని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, వితంతు, వికలాంగుల రైతులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు లబ్ధి కలుగుతుందన్నారు. అర్హులైన రైతులు ఆధార్, భూమి పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్, జాబ్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పశుకిసాన్ క్రెడిట్ కార్డులు

పశుకిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పశుపోషకులకు పశువుల దాణా, వైద్య ఖర్చుల కోసం గేదెలకు రూ.40 వేల నుంచి రూ.45 వేలు, ఆవులకు రూ 30 వేల నుంచి రూ.35 వేలు, గొర్రెలు, మేకల పెంపకం కోసం రూ.38 వేల నుంచి రూ.42 వేలు, బ్రాయిలర్ కోళ్ల పెంపకం కోసం ఒక్కొక్క కోడికి రూ.150 వరకు, లేయర్ కోళ్లకు రూ.220 వరకు రుణం మంజూరు చేస్తారన్నారు.

జిల్లాలో ఈ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో మండలానికి 32 మంది చొప్పున మొత్తం 800 మంది రైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణం మంజూరుకు లక్ష్యం నిర్ణయించారన్నారు. జిల్లాలో మూడు నియోజకవర్గస్థాయి పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాల ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 639 నమూనాలను సేకరించి వాటిని పరీక్షించడం ద్వారా వ్యాధి నిర్ధారణ చేయడం జరిగిందన్నారు.

పశు సంచార ఆరోగ్య సేవ

సంచార పశు ఆరోగ్య సేవల కోసం జిల్లాలో నియోజకవర్గానికి రెండు చొప్పున రేపల్లె, బాపట్ల, పర్చూరు, అద్దంకి, చీరాల, వేమూరులకు వాహనాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ వాహనాల్లో ఒక పశు వైద్యుడు, పారా వెటర్నరీ సహాయకుడు, డ్రైవర్ ఉంటారన్నారు. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు 634 పశువులకు వైద్యం అందించినట్లు తెలిపారు. పశుపోషకులు 1962కి కాల్ చేయడం ద్వారా ఉచిత పశు వైద్య సేవలు పొందవచ్చన్నారు.

రైతులకు సమీకృత పశువుల దాణా

2025-26 ఆర్థిక సంవత్సరంలో 1038.65 మెట్రిక్ టన్నుల సమీకృత పశువుల దాణా సరఫరా చేసేందుకు అనుమతులు మంజూరయ్యాయన్నారు. మొదటి విడతగా జిల్లాలో రూ 10.69 లక్షల విలువ గల 465 మెట్రిక్ టన్నుల సమీకృత పశువుల దాణాను 50 శాతం సబ్సిడీపై రైతులకు సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.11.98 లక్షల ప్రభుత్వ రాయితీ ద్వారా 1,210 పశువులకు బీమా చేశామని పేర్కొన్నారు.